
వినతుల స్వీకరణ



అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..



అక్షరంపై విశ్వాసం

- ఎమ్మెల్యే దృష్టికి ఏళ్ల నాటి సమస్యలు
- పింఛన్లు.. ఇళ్లు.. రేషన్ కార్డులకు వినతి
- మౌలిక వసతులు, అభివృద్ధిపైనా చర్చ

ఆదర్శ కాలనీలో పోటెత్తిన జనం

ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ కార్యక్రమానికి విశేష స్పందన


సమస్యలు విన్నవించేందుకు వచ్చిన 32వ డివిజన్ ప్రజలు

ఇన్నాళ్లూ సమస్యలకు అక్షర రూపమిచ్చి.. వాటి పరిష్కారానికి పరోక్షంగా పాటుపడిన ఆంధ్రజ్యోతి.. సరికొత్త ఆలోచన చేసింది. ప్రజల వద్దకే పాలకులు, అధికారులను తీసుకువెళ్లి.. నేరుగా సమస్యలను చెప్పుకునే అవకాశం కల్పించింది. 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' క్షేత్రస్థాయికి వెళ్లింది. ఆంధ్రజ్యోతి అక్షరాలపై అచంచల విశ్వాసం ఉన్న ప్రజలు.. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో ఏళ్ల తరబడి అనుభవిస్తున్న కష్టాలను చెప్పుకున్నారు. సావధానంగా విన్న ప్రజా ప్రతినిధులు, అధికారులు.. పరిష్కారానికి స్పష్టమైన హామీ ఇచ్చారు. ఒక్కొక్క సమస్యను రాసుకుని.. బాధితులకు పేరు పేరునా సమాధానమిచ్చారు. ఈ క్రమంలో కొన్ని సమస్యలకు వేగవంతమైన పరిష్కారం దిశగా అడుగులు పడ్డాయి. ప్రభుత్వ విధానాలు, నిధులతో ముడిపడిన సమస్యలను సైతం వేగంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతపురం నగరంలోని ఆదర్శ నగర్‌లో మంగళవారం ఉదయం ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' కార్యక్రమానికి ఐదు వందల మందికి పైగా ప్రజలు హాజరయ్యారు.

అనంతపురంక్రైం/ప్రెస్‌క్లబ్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని 32వ డివిజన్ ఎన్టీఆర్ స్కేటింగ్ మైదానంలో ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో మంగళవారం 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమం జరిగింది. అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ మల్లికార్జున రెడ్డి, పలు విభాగాల అధికారులు హాజరయ్యారు. డివిజన్ ప్రజలు ఇంటి స్థలాలు, పింఛన్లు, ఉపాధి, పార్కులు, రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, భూ కబ్జాలు తదితర సమస్యలను అధికారులు, ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. వైసీపీ హయాంలో పింఛన్లను తొలగించడంతో ఇబ్బందిపడుతున్నామని బాధితులు కొందరు కన్నీరు పెట్టారు. పది రోజుల్లో పరిష్కారం చూపుతామని, బాధపడవద్దని ఎమ్మెల్యే వారికి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంహెచ్‌ఓ విష్ణుమూర్తి, ఎస్‌ఈ భాస్కర్‌రావు, టీడీపీ డివిజన్ ఇన్‌చార్జ్ రాంప్రసాద్, క్లస్టర్ ఇన్‌చార్జ్ సరిపూటి రమణ, మాజీ కార్పొరేటర్ బల్లా పల్లవి, టీడీపీ సీనియర్ నాయకులు శింగవరం రవి తదితరులు పాల్గొన్నారు.

వివరాలు 4లో

గుడిసెల్లో ఉంటున్నాం...



సార్..! మేము 30 ఏళ్లుగా కాలనీల్లో గుడిసెలు వేసుకొని నివాసముంటున్నాం. మా ఇళ్ల వద్ద కరెంటు లేదు. రోడ్లు లేవు. కాలువలు లేవు. ఎక్కడ చూసినా ముళ్లకంపలు పెరిగిపోయాయి. పాములు, తేళ్లు గుడిసెల్లోకి వస్తున్నాయి. ఎన్నోసార్లు ఆస్పత్రుల పాలయ్యాం. మేముంటున్న గుడిసెలకు పట్టాలు లేవు. మాకు న్యాయం చేయండి

- లక్ష్మి, ఆదర్శ నగర్

కోకలు కట్టుకుని స్నానం చేస్తున్నాం...



సార్..! మాకు సరైన ఇళ్లు లేవు. గుడిసెల్లో ఉంటున్నాం. బండలకు కోకలు కట్టుకొని ఆడోళ్లు స్నానాలు చేస్తున్నాం. మాకు మరుగుదొడ్లు లేవు. బాత్ రూములు లేవు. పరిస్థితి దారుణంగా ఉంది. ఎంత మంది రాజకీయ నాయకులు వచ్చినా ఎవరూ ఏం చేయడం లేదు. ఎన్నాళ్లిలా బతకాలి..? ఇళ్లు కట్టించి మమ్మల్ని ఆదుకోండి.

- సాకే వెంకటమ్మ, ఆదర్శనగర్

గుడిసెలు పీకేస్తామంటున్నారు..



సార్..! ఆదర్శనగర్ కాలనీ చివరలో 40 కుటుంబాల వాళ్లం 30 ఏళ్లుగా గుడిసెలు వేసుకొని ఉంటున్నాం. అది మున్సిపాలిటీ స్థలమని అంటున్నారు. ఎప్పుడు పడితే అప్పుడు ఎవరో ఒకరు వచ్చి ఖాళీ చేయమంటున్నారు. యంత్రాలతో గుడిసెలు పీకేస్తామని బెదిరిస్తున్నారు. ఎన్నాళ్లిలా భయపడుతూ బతకాలి..? ఎక్కడైనా మాకు ఇంటి స్థలాలు కేటాయించి ఇళ్లు కట్టించి న్యాయం చేయండి.

- ముత్యాలమ్మ, ఆదర్శనగర్ శివారు కాలనీ

ఎమ్మెల్యే: గుడిసెల్లో దశాబ్దాలుగా ఉంటున్నవారికి బుక్కరాయసముద్రంలో స్థలాలను కేటాయించారు. కానీ దూరమవుతుందని వారు వెళ్లడం లేదు. నగరానికి సమీపంలోనే స్థలాలు కేటాయించేందుకు ప్రయత్నిస్తాం. ఇళ్లను నిర్మించి వారి సమస్యలను పరిష్కరిస్తాం.

చాలెంజ్‌గా తీసుకుంటాం: ఇన్‌చార్జి కమిషనర్



సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని మొదలు పెట్టినందుకు ఆంధ్రజ్యోతికి ధన్యవాదాలు. ప్రజల్లో తిరగడం, సమస్యలను తెలుసుకోవడం అధికారులకు, ప్రజాప్రతినిధులకే కొత్తేమీ కాదు. కానీ ప్రజలకు అందాల్సినవి అందుతున్నాయో లేదో తెలుసుకునేందుకు ఇదొక అవకాశంగా భావిస్తున్నాం. మంచినీరు, పార్కు, సెల్‌ఫోన్ టవర్స్, వీధికుక్కలు, వీధిలైట్లు, ఇళ్లు, పింఛన్లు, ఆరోగ్యం.. ఇలా అనేక సమస్యలు ఉన్నాయి. వీటిని ఒక్కరే పరిష్కరించడానికి వీలు కాదు. అన్ని సమస్యల పరిష్కారానికి ఇదొక వేదిక. దీన్ని అధికారులందరం చాలెంజ్‌గా తీసుకుంటాం. సమస్యలపై ఎలాంటి చర్యలు తీసుకున్నామో వారంలోగా తెలియజేస్తాం. కొన్ని సమస్యలు వెంటనే పరిష్కరించగలిగేవి ఉన్నాయి. పింఛన్ వంటి వ్యక్తిగత సమస్యలకు టెక్నికల్ సమస్యలు ఉన్నాయి. వాటిని ఎలా పరిష్కరించాలో పరిశీలిస్తాం. బుక్కరాయసముద్రంలో 40 కుటుంబాలకు ఇంటి స్థలాలు ఇచ్చామా లేదా అన్నది పరిశీలిస్తాం. ఇవ్వకపోతే స్థలం చూస్తాం. పార్కు అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభిస్తాం. రోడ్ల పనులకు టెండర్లు పిలిచామని ఎస్‌ఈ చెప్పారు. విద్యుత్ సమస్యను ఎస్‌ఈతో మాట్లాడి పరిష్కరిస్తాం.

ఎమ్మెల్యే: రేషన్ కార్డులను మంజూరు చేయిస్తాం. పింఛన్ అందించి ఆదుకుంటాం. ఇంటి స్థలాన్ని కేటాయించి, ఇంటిని నిర్మించి ఇస్తాం. అధైర్యపడాల్సిన అవసరం లేదు. మీకు ప్రభుత్వపరంగా అండగా ఉంటాం. అన్ని విధాలా ఆదుకుంటాం.

పరిష్కారం చూపుతాం: ఎమ్మెల్యే

ఇంత పెద్ద కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు ఏబీఎన్-ఆంధ్రజ్యోతి యాజమాన్యానికి, సిబ్బందికి కృతజ్ఞతలు. ఆదర్శనగర్‌లో మరో వారంలో 'మీ ఇంటికి మీ ఎమ్మెల్యే' కార్యక్రమం నిర్వహించాలని అనుకున్నాను. అంతకంటే ముందు ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఇంత మందిని కలిపింది. ప్రజల సమస్యలను మా దృష్టికి తెచ్చింది. ఇంటింటికీ వెళ్లి ఇంతమందిని కలవాలంటే కనీసం నాలుగైదు గంటల సమయం పడుతుంది. ప్రజలు మా దృష్టికి తెచ్చిన సమస్యలను పది రోజుల్లోపు పరిష్కరిస్తాం.

నాకు దిక్కులేదు..



సార్..! నా కుమారుడు చనిపోయాడు. నాకు ఎవరూ దిక్కులేరు. మొదట్లో పింఛన్ ఇచ్చేవారు. రెండేళ్ల కింద తీసేశారు. ఇబ్బందిగా ఉంది. కనీసం బియ్యం కార్డు కూడా లేదు. మీరే నన్ను ఆదుకోవాలి.

- వెంకటలక్ష్మి

పింఛన్ ఇవ్వడం లేదు...



సార్..! నా భర్త గణేష్ సంవత్సరం కిందట చనిపోయాడు. నాకు రేషన్‌కార్డు లేదు. పింఛన్ ఇవ్వడం లేదు. పింఛన్ కోసం సచివాలయానికి వెళ్తే.. పై నుంచి అప్డేట్ రాలేదని అంటున్నారు. రేషన్ కార్డు అడిగినా... ఇంటి స్థలం అడిగినా అదే చెబుతున్నారు. నాకు మూడేళ్ల బాబు ఉన్నాడు. బతకడం బరువుగా మారింది. నాకు ఇల్లు కట్టించి ఇవ్వండి. రేషన్‌కార్డు, పింఛన్ ఇచ్చి ఆదుకోండి.

- లక్ష్మిరాజేశ్వరీ, విద్యుత్‌నగర్



అమ్మేదెలా..?

- కేంద్రాలు ఆరంభించి నాలుగు రోజులైనా... కొనుగోలు ఏదీ..?
- జిల్లా వ్యాప్తంగా 3900 మంది రైతుల రిజిస్ట్రేషన్
- మూడు మండలాల్లో 20 మెట్రిక్ టన్నులే కొనుగోలు

కందుల కొనుగోలుకు ని'బంధనాలు'..!

కందుల కొనుగోలుకు నిబంధనలు అడ్డంకిగా మారాయి. ఏపీ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 31 కంది కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. నాలుగు రోజుల కిందట కొనుగోలు ప్రక్రియ ఆరంభించారు. అయితే ఇప్పటి దాకా ఆత్మకూరు, కళ్యాణదుర్గం, గుంతకల్లు మండలాల్లోని కొన్ని కేంద్రాల్లోనే కొనుగోలు ఆరంభించారు. మిగతా మండలాల్లో ఎక్కడా ఇంకా ప్రక్రియ మొదలు పెట్టలేదు. దీంతో ఆయా మండలాల్లోని రైతులు ఎప్పటి నుంచి కందులు కొంటారోనని ఎదురు చూస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం అర్బన్/ఉరవకొండ


మార్కెట్ యార్డులో కందులు ఆరబెట్టిన రైతులు

ఇప్పటి దాకా 20 మెట్రిక్ టన్నులే కొనుగోలు

జిల్లాలో గతేడాది ఖరీఫ్‌లో 1.03 లక్షల హెక్టార్లల్లో కంది పంట సాగు చేశారు. 71వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. కనీస మద్దతు ధరతో 45వేల మెట్రిక్ టన్నులు కందులు కొనుగోలు చేయాలని భావించారు. కనీస మద్దతు ధర ఆధారంగా కొనుగోలు చేస్తుండటంతో ఎన్ని క్వింటాళ్లు కొనుగోలు చేయాలన్న అంశాన్ని త్వరలో నిర్ణయిస్తామని రాష్ట్ర ఉన్నతాధికారులు పేర్కొన్నట్లు సమాచారం. జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో 3900 మంది రైతులు తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. నాలుగు రోజుల కిందట కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. అయితే ఇప్పటి దాకా 20 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు.

కొనుగోలుకు అడ్డంకిగా నిబంధనలు

కందుల కొనుగోలుకు నిబంధనలు అడ్డంకిగా మారుతున్నాయి. క్వింటా కంది కనీస మద్దతు ధర రూ.7550లుగా ప్రభుత్వం నిర్ణయించింది. తేమ శాతం 12లోపు ఉంటేనే కొనుగోలు చేయాలని నిర్ణయించారు. పలు ప్రాంతాల్లో 14 నుంచి 15 శాతం తేమ చూపిస్తుండటంతో కందులు ఆరబెట్టుకొని మళ్లీ రావాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు స్పష్టం చేస్తున్నారు. తేమశాతంలో మినహాయింపు ఇవ్వాలని కంది కొనుగోలు కేంద్రం ఆరంభం రోజు ఉన్నతాధికారుల దృష్టికి స్థానిక రైతులు తీసుకెళ్లారు. అయితే కొనుగోలుకు అడ్డంకిగా ఉన్న నిబంధనలు సడలించలేదు. మరి కొన్ని ప్రాంతాల్లో కందులు జల్లెడ పట్టుకొని రావాలని వెనక్కి పంపుతున్నారు. మరోవైపు ఈ పంట నమోదు చేసుకున్న రైతులతోనే పంటను కొనుగోలు చేస్తున్నారు. అందులోనూ మండల యూనిట్‌గా దిగుబడి ఆధారంగా ఒక్కో రైతుతో ఎకరాకు ఎన్ని క్వింటాళ్లు కొనుగోలు చేయాలన్న వివరాలు సీఎం యాప్‌లో చూపిస్తోంది. ఆ వివరాల ఆధారంగానే ఆయా రైతులతో కందులు కొనుగోలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పలు మండలాల్లో ఒక్కో రైతుకు ఎకరాకు 2 క్వింటాళ్లు, మరికొన్ని మండలాల్లో 3 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేయాలని యాప్‌లో చూపిస్తోంది. దీంతో ఎక్కువ విస్తీర్ణంలో పంట సాగు చేసిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదాహరణకు గుంతకల్లు డివిజన్‌లోని ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరూరు, గుంతకల్లు మండలాల్లో 37,247 ఎకరాల్లో కంది పంట సాగైంది. ఆయా మండలాల్లో ఈ సారి దిగుబడి ఆశాజనకంగా ఉంది. దీంతో ఎకరాకు 5 క్వింటాళ్ల దాకా దిగుబడి వచ్చింది. అధికారులు డివిజన్‌లో ఎకరాకు 3 క్వింటాళ్ల దిగుబడి వచ్చినట్లు నమోదు చేశారు. ఈ లెక్కన సీఎం యాప్ వివరాల మేరకు ఒక్కో రైతు నుంచి 3 క్వింటాళ్ల వరకే కొనుగోలు చేయాలని నిర్ణయించారు. దీంతో మిగతా పంటను ఎక్కడ విక్రయించాలో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో చాలా మంది రైతులు కొనుగోలు కేంద్రాల్లో పంటను విక్రయించేందుకు ముందుకు రావడం లేదు. ఈ పరిస్థితుల్లో గతంలో రైతు సేవా కేంద్రాల్లో కందులు విక్రయించేందుకు తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకున్నప్పటికీ రాయచూర్, బళ్లారి మార్కెట్‌లో విక్రయించేందుకు ఎక్కువ మంది రైతులు సిద్ధమవుతున్నారు.

ఎకరాకు మూడు క్వింటాళ్లే కొంటామంటే ఎలా..?



నెల రోజులుగా మార్కెట్ యార్డులోనే కందులను ఆరబెట్టుకుని ఉంటున్నాం. కొనుగోలు కేంద్రాల్లో కందులు ఎప్పుడు కొంటారో తెలియని పరిస్థితి. 15ఎకరాల్లో కంది పంట సాగు చేశాం. ఎకరాకు 5 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఎకరాకు మూడు క్వింటాళ్లు కొంటే మిగిలిన కందులను ఎక్కడ అమ్ముకోవాలి. ఏం చేయాలో అర్థం కావడం లేదు. ఎకరాకు 5 క్వింటాళ్లు కొనుగోలు చేసేలా ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకొని రైతులను ఆదుకోవాలి.

- రైతు గోపాల్, ఉరవకొండ


ఎప్పుడు కొంటారో ఏమో..



ఉరవకొండలో కొనుగోలు కేంద్రం ప్రారంభించి నాలుగు రోజులైనా.. ఇప్పటి దాకా ఒక్క క్వింటా కొనుగోలు చేయలేదు. ఎప్పుడు కొంటారో.. ఏమో? కందుల కొనుగోలుపై అధికారులు స్పష్టమైన సమాచారం ఇవ్వడం లేదు. ఐదెకరాల్లో పంట సాగు చేశా. 30 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. 10 రోజుల క్రితం రైతు సేవా కేంద్రంలో పేరు రిజిస్ట్రేషన్ చేసుకున్నా. ప్రభుత్వం ఇంకా కొనుగోలు చేయకపోవడంతో రాయచూర్ మార్కెట్‌కు తీసుకుని వెళ్లానుకుంటున్నా.

- రైతు నరసింహులు, ఉరవకొండ

ముఖ్యమంత్రికి సీపీఎం బహిరంగ లేఖ



ఏపీ మార్క్‌ఫెడ్ జిల్లా కార్యాలయం

అనంతపురం కల్చరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కంది కొనుగోలులో నిబంధనలు సడలించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు తాను రాసిన బహిరంగ లేఖను సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ మంగళవారం విడుదల చేశారు. జిల్లాలో ఇప్పటివరకు ఉరవకొండ, గుంతకల్లు, కళ్యాణదుర్గం, ఆత్మకూరు, గుత్తి, వజ్రకరూరు, గుత్తి, రాయదుర్గం, బెళుగుప్పలలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారన్నారు. అయితే ఆత్మకూరులో 8.90 మెట్రిక్ టన్నులు, గుంతకల్లులో 9.70 మెట్రిక్ టన్నులు, కళ్యాణదుర్గంలో 1 మెట్రిక్ టన్ను మొత్తంగా 19.65 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారన్నారు. మిగిలిన కేంద్రాల్లో ఇంతవరకూ కొనుగోళ్లు ప్రారంభమే కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కంది కొనుగోలు తక్కువగా ఉండటానికి మార్క్‌ఫెడ్ నిబంధనలే ప్రధాన కారణమన్నారు. ఈ క్రాప్ బుకింగ్ కౌలు రైతులకు సాధ్యం కాదని, ఆ నిబంధనను మార్చాలని డిమాండ్ చేశారు. నిబంధనల వల్లే రైతులు రాయచూర్‌తో పాటు కర్ణాటకలోని ఇతర ప్రాంతాలకు తాము పండించిన కందిని తరలించి, విక్రయిస్తున్నట్లు తెలిపారు.

నిబంధనల మేరకే..

ప్రభుత్వ నిబంధనల మేరకే కందులు కొనుగోలు చేస్తున్నాం. ఇప్పటి దాకా 4 మండలాల్లో కందులు కొనుగోలు మొదలైంది. కొన్ని సాంకేతిక కారణాలు, తేమ శాతం ఎక్కువగా ఉండటంతో కొనుగోలు ఆలస్యమవుతోంది. నిబంధనల మేరకు తేమ శాతం 12లోపు ఉండాలి. అయితే పలు ప్రాంతాల్లో 14 నుంచి 15 శాతం తేమ శాతం వస్తోంది. అందుకే కందులు ఆరబెట్టుకొని రావాలని సూచిస్తున్నాం. ఈ పంట నమోదు చేసుకున్న రైతులతోనే రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నాం. మండల యూనిట్‌గా దిగుబడి ఆధారంగా సీఎం యాప్‌లో చూపించిన మేరకు ఎకరాకు 2 నుంచి 3 క్వింటాళ్ల దాకా కందులు కొనుగోలు చేస్తున్నాం. కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటాం.

- పెన్నేశ్వరి, ఏపీ మార్క్‌ఫెడ్ డీఎం

పట్టాలు తప్పిన లోకో

గుంతకల్లు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు రైల్వే స్టేషన్ 1వ నంబరు ప్లాట్‌ఫారానికి వెళ్లే లైన్‌లో విద్యుత్ రైలింజన్ పట్టాలు తప్పింది. పెట్టెలు లేని రైలింజన్ లోకో షెడ్ వద్ద ఉన్న సైడింగ్‌లోకి వెళ్తున్న సమయంలో లింక్ సమస్య కారణంగా మంగళవారం సాయంత్రం పట్టాలు తప్పింది. ఈ కారణంగా 1వ నంబరు ప్లాట్‌ఫారం మీదుగా రైళ్లు వెళ్లే అవకాశం లేక, ఆ సమయంలో వచ్చిన రైళ్లను 2, 3 ప్లాట్‌ఫారాలకు మళ్లించారు. అధికారులు, సిబ్బంది రెండు గంటలపాటు శ్రమించి సమస్యను పరిష్కరించారు.


అనంతపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్


కొత్తచెరువులో మాట్లాడుతున్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. అనంతపురం ఆదర్శ కాలనీ, కొత్తచెరువు బీసీ కాలనీలో సభలకు వెయ్యిమందికి పైగా ప్రజలు హాజరయ్యారు. కొందరు నేరుగా గళం విప్పి తమ సమస్యలను ఎమ్మెల్యేలు, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మరికొందరు వినతిపత్రాలను సమర్పించారు. అనంతపురంలో అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, కొత్తచెరువులో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి ప్రజల సమస్యలను నోట్ చేసుకుని, అంశాలవారీగా స్పందించారు. కొన్నింటికి తక్షణ పరిష్కారం చూపించారు. మిగిలినవాటి పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి, తమకు నివేదిక ఇవ్వాలని సూచించారు. ఆంధ్రజ్యోతి అక్షరంపై విశ్వాసం ఉంచి.. అరుదైన ఈ కార్యక్రమానికి జనం భారీగా తరలిరావడం విశేషం. సామాజిక బాధ్యతగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ చేపట్టిన ఈ కార్యక్రమం ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రజాప్రతినిధులు, అధికారులు, పాఠకులు హర్షం వ్యక్తం చేశారు.

- ఆంధ్రజ్యోతి, ధర్మవరం, అనంతపురం క్రైం

అక్షరంపై విశ్వాసం


ఆంధ్రజ్యోతి -ఏబీఎన్ వేదికపై ప్రజాగళం

■ సమస్యలపై వెల్లువలా వినతులు.. ఫిర్యాదులు... ■ ఓపికగా ఆలకించిన ప్రజాప్రతినిధులు, అధికారులు ■ ప్రాధాన్యక్రమంలో పరిష్కారానికి అక్కడికక్కడే హామీ

చిత్రావతి, వంగపేరు బ్రిడ్జిలపై ఎత్తు పెంచాలి.

- పూల శివప్రసాద్, జనసేన మండల కన్వీనర్, కొత్తచెరువు

పీఆర్ జేఈ: వర్షాలు వచ్చినప్పుడు వంగపేరు, చిత్రావతి నది పొంగి పొర్లడంతో ఆమిదాలకుంట, మరుకుంటపల్లి, కొత్తచెరువు సమీపంలో బ్రిడ్జిపై నీరు రోడ్డుపై ప్రవహిస్తున్న మాట వాస్తవమే. ఈ విషయాన్ని ఆర్అండ్‌బీ అధికారులు, పంచాయతీ రాజ్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.




సమస్యలు తెలిపేందుకు వచ్చిన అనంతపురంవాసులు

బీసీకాలనీలో మా ఇళ్లమీద 33కేవీ లైన్ వెళ్తోంది. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. సమస్యను పరిష్కరించండి.

ఒలిపి శ్రీనివాసులు, టీడీపీ కొత్తచెరువు పట్టణ కన్వీనర్

ట్రాన్స్‌కో ఏఈ, వెంకటేశ్ నాయక్: బీసీకాలనీలోని ఇళ్లపై 33 కేవీ విద్యుత్‌లైన్ వెళ్లడం వాస్తవమే. ఇటీవల ప్రమాదాలు జరగకుండా వైర్ల ఎత్తు పెంచాం. లైన్ మార్చడం నా పరిధిలో లేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి సైతం తీసుకెళ్లాం.

వ్యవసాయ బావులకు సరఫరా అయ్యే విద్యుత్ కేబుల్ కాలి పోయింది. పంటలు ఎండుతున్నాయి. సమస్యను పరిష్కరించాలని పలు మార్లు ట్రాన్స్‌కో అధికారులకు చెప్పినా పట్టించుకోలేదు.

- బీడుపల్లి సుబ్బరాయుడు, కొత్తచెరువు

శివరాం, ట్రాన్స్‌కో ఈఈ: విద్యుత్ కేబుల్ కాలి పోయిన విషయం వాస్తవమే. అయితే తలమర్ల సబ్ స్టేషన్ నుంచి వ్యవసాయ బావులకు విద్యుత్ సరఫరా అందిస్తున్నాం. లో ఓల్టేజ్ లేకుండా సమస్యను పరిష్కరిస్తాం. కేబుల్ కోసం ప్రతిపాదనలు పంపాం. కేబుల్‌రాగానే ఏర్పాటు చేస్తాం.

ప్రశ్న: జగనన్న కాలనీ కోసం 14 ఎకరాల భూములు తీసుకున్నారు. పరిహారం కోసం మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి విన్నవించాం. అధికారుల చుట్టు తిరిగినా పట్టించుకోలేదు. ఎక్కువగా మాట్లాడితే కేసులు బనాయిస్తామని బెదిరించారు. భూములు కోల్పోయాం. పైసా పరిహారం ఇవ్వలేదు.

- నాగేంద్రప్రసాద్, రైతు, కొత్తచెరువు

జగనన్న లే ఔట్‌కు 1.30 ఎకరాల భూమి ఇచ్చాం. పరిహారం రూ.50లక్షలు, ఇళ్లపట్టాలు ఇస్తామన్నారు. ఇంత వరకు ఇవ్వలేదు.

- పీవీ నవీన్‌కుమార్, సాగునీటిసంఘం అధ్యక్షుడు

డీటీ బాలాంజనేయులు: ఎక్కడైనా పరిహారం చెల్లించిన తరువాతనే భూమిని స్వాధీనం చేసుకుంటారు. కానీ గతంలో ఇది ఎలా జరిగిందో పరిశీలించి న్యాయం చేస్తాం. అదేవిధంగా జగనన్న కాలనీకి దారి కోసం తీసుకున్న భూ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపడతాం.

ప్రమాదంలో చెయ్యి పోయింది. మా ఆయన కూడా మంచాన పడ్డాడు. కుటుంబం గడవడం కష్టమైంది. పింఛన్ కోసం పలు మార్లు దరఖాస్తు చేసుకున్న మంజూరు కాలేదు. పింఛన్ మంజూరు చేయించండి.

-నాగరత్న, కొత్తచెరువు

ఈఓ: త్వరలో పింఛన్ దరఖాస్తుకు సైట్ ఓపెన్ అవుతుంది దరఖాస్తు చేసుకుంటే పింఛన్ మంజూరయ్యేలా చూస్తాం.

పింఛన్ ఇచ్చి ఆదుకోండి సార్..

ఎమ్మెల్యే సార్... నాకు ఎవరూ లేరు. గతంలో పింఛన్ వచ్చేది. కరెంటు బిల్లు ఎక్కువ వస్తోందని 2021లో పింఛన్ తీసేశారు. అడిగితే ఎవరూ ఏమీ చెప్పడం లేదు. నేను టీడీపీ సానుభూతిపరురాలనే పింఛన్ తీసేశారు. నాకు పింఛనే ఆదరవు. ఆరోగ్యం బాగోలేదు. మాత్రలు కొనుక్కుందామన్నా డబ్బులు లేవు. నాకు మళ్లీ పింఛన్ ఇప్పించి ఆదుకోండి సార్.

- అచ్చమ్మ, విద్యుత్‌నగర్, అనంతపురం

ఎమ్మెల్యే: టీడీపీ సానుభూతిపరురాలనే కారణంగా పింఛన్ తొలగించారని అచ్చమ్మ చెబుతున్నారు. ఆమెకు ఆదరణ లేదు. న్యాయబద్ధంగా రావాల్సిన ఫించన్ రానివ్వడం లేదు. కొత్త పింఛన్లు శాంక్షన్ కాగానే మొదటి ఫించన్ ఆమెదే అవుతుందన్నారు.

ఖాళీ స్థలాలను క్లీన్ చేయించండి...

ఆదర్శ కాలనీలో చాలా ప్రైవేట్ స్థలాలున్నాయి. వాటిలో కంపచెట్లు, చెత్తాచెదారం నిండుకోవడంతో అపరిశుభ్రంగా తయారయ్యాయి. దుర్వాసనతో ఇబ్బందిపడుతున్నాం. ఇళ్లలోకి విషపురుగులు వస్తున్నాయి. చెత్తను, ముళ్ల పొదలను తొలగించండి.

- చిన్నకొండయ్య, అనంతపురం

ఎమ్మెల్యే: ఆదర్శ నగర్‌తోపాటు నగరంలోని ఖాళీ స్థలాలన్నింటినీ శుభ్రం చేయిస్తాం. ఇప్పటికే ఎంహెచ్‌ఓకు సూచనలు ఇచ్చాం. ప్రతి కాలనీలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి, ఖాళీ స్థలాల యజమానులను పిలిపించి శుభ్రం చేయిస్తాం. ఇప్పటికే శారదా నగర్‌లో శుభ్రం చేయించాము. యజమాని రాకపోతే మేమే శుభ్రం చేయించి, వారికి జరిమానా విధిస్తాం.

రోడ్లు కబ్జా అవుతున్నాయి..

ఆదర్శ నగర్ 341 సర్వే నంబర్‌లో రోడ్డు లైన్ లేదు. కంపచెట్లు ఏపుగా పెరిగిపోయాయి. దారిలో వెళుతున్నప్పుడు ముళ్ల తగిలి గాయపడుతున్నాం. ఇబ్బందికరంగా ఉంది. 31 సర్వే నంబర్‌లో రోడ్లను కొందరు కబ్జా చేస్తున్నారు. వాటిని వెంటనే కాపాడి రోడ్లు నిర్మించాలి. మరికొన్ని చోట్ల రోడ్లలో గుంతలు ఏర్పడ్డాయి. వాటిని పూడ్చాలి.

- చెన్నకేశవ, అనంతపురం

ఎమ్మెల్యే: వైసీపీ ప్రభుత్వంలో రోడ్లను ఆక్రమించారు. ఈ విషయాన్ని ప్రభుత్వానికి తెలియజేశాను. వీలైనంత త్వరగా రోడ్లు, డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తాం.

సింగిల్ ఫేజ్‌తో ఇబ్బందులు

ఆదర్శ కాలనీలో సింగిల్ ఫేజ్ లైన్‌తో కరెంటు సమస్య ఏర్పడుతోంది. త్రిబుల్ ఫేజ్ లైన్ ఇవ్వాలని పలుమార్లు కోరినా ఎవరూ పట్టించుకోవడం లేదు. హౌసింగ్ బోర్డు మెయిన్ రోడ్డులో విచ్చలవిడిగా బంకులు ఉన్నాయి. రోడ్డుకు ఇబ్బంది మారింది. లక్ష్మీనరసయ్య కాలనీలో లో ఓల్టేజీ సమస్య ఉంది. రోడ్లు లేవు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. సమస్యలను పరిష్కరించండి సార్...

- దాసరి శ్రీనివాసులు, ఆదర్శనగర్

ఎమ్మెల్యే: ఎస్ఈతో మాట్లాడి త్రీఫేజ్ విద్యుత్ ఇచ్చేలా చూస్తాం. మిగిలిన సమస్యలను కూడా సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తాం.

ఆస్పత్రిని నిర్మించండి

స్కేటింగ్ మైదానంతో ఎవరికీ ఉపయోగం లేదు. ఎవరో కొంత మంది పిల్లలు వస్తున్నారు. ఆ స్థలంలో ఆస్పత్రిగాని, పాఠశాలగాని ఏర్పాటు చేస్తే పేద ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది. కాలనీలో మురుగు కాలువలు అధ్వానంగా ఉన్నాయి. సమస్యలను పరిష్కరించండి

- ఆంజనేయులు, రిటైర్డ్ హెచ్ఎం, అనంతపురం

ఎమ్మెల్యే: స్కేటింగ్ స్థలం వందమంది విద్యార్థులకు ఉపయోగపడుతోంది. పాఠశాల, ఆస్పత్రి కావాలంటే వేరే స్థలం చూసి ఏర్పాటు చేయిస్తాం. విద్య, వైద్యం ఎంత అవసరమో.. క్రీడలూ అంతే అవసరం.

రోడ్డు నిర్మించాలి

హమాలీ కాలనీ వాటర్ ట్యాంకు వద్ద 40 అడుగుల రోడ్డుకు చాలాసార్లు భూమి పూజ చేశారు. పనులు ప్రారంభమయ్యాయి. కానీ పూర్తి చేయడంలేదు. ప్రతిసారీ ఇలాగే జరుగుతోంది. కాలనీలో కంపచెట్లు పెరిగి అధ్వాన్నంగా ఉంది. పలు రోడ్లపై గుంతలు పడ్డాయి. వెంటనే రోడ్ల నిర్మాణం చేపట్టాలి.

- మహబూబ్ పీరా, రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్, అనంతపురం

ఎమ్మెల్యే: వైసీపీ ప్రభుత్వంలో రూ.25 కోట్ల స్పెషల్ గ్రాంట్ తీసుకొచ్చారు. రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసి వదిలి పెట్టారు. ఎక్కడా పనులు ప్రారంభించిన దాఖలాలు లేవు. ఆ పనుల టెండర్లు క్యాన్సిల్ అయ్యాయి. కొత్త టెండర్లు పిలిచి రోడ్లు వేయిస్తాం. హమాలీకాలనీలో రోడ్డు పనులను త్వరలోనే ప్రారంభిస్తాం.

ఇల్లు లేదు.. పింఛన్ లేదు..

సార్..! నాకు పింఛన్ లేదు. ఇల్లు లేదు. ఎలాంటి ఆదరవు లేదు. ఎన్నిసార్లు ఎంత మందిని అడిగినా పట్టించుకోవడం లేదు. సచివాలయానికి వెళ్లి అడిగితే వారు ఏవేవో చెబుతున్నారు. అర్థం కావడం లేదు. నాకు ఇల్లు కట్టించి, పింఛన్ ఇప్పించండి.

- ఫాతిమా, ఆదర్శనగర్

ఎమ్మెల్యే: మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి మీ సమస్యలను పరిష్కరిస్తాం.

పార్కు ఏర్పాటు చేయండి

సార్.. ఆదర్శ నగర్‌లో 40 సెంట్లు కార్పొరేషన్ స్థలం ఉంది. అది కబ్జాకు గురికాకుండా కాలనీవాసుల ఆహ్లాదం కోసం ఒక పార్కును ఏర్పాటు చేయండి. ఆ స్థలంలో కాలనీవాసులకు ఉపయోగపడే ఇతర పనులను కూడా చేపట్టండి.

- రాజారెడ్డి, అనంతపురం

ఎమ్మెల్యే: వాటర్ ట్యాంకు సమీపంలో పార్కు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అక్కడ ప్రైవేట్ స్థలం ఉంది. కార్పొరేషన్ స్థలం ఉంటే పార్కు ఏర్పాటు చేయిస్తాం.

రైతు బజారు ఏర్పాటు చేయండి

ఆదర్శ నగర్ నుంచి పాతూరుకు వెళ్లి సరుకులు, కూరగాయలు తెచ్చుకోవాలంటే రవాణా ఖర్చులు అధికమవుతున్నాయి. చాలా మంది వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో చాలా చోట్ల ఖాళీ స్థలాలున్నాయి. ఏదో ఒకచోట రైతు బజారు ఏర్పాటు చేస్తే మాలాంటి వ్యాపారులకు ఇబ్బందులు తప్పుతాయి.

- నరసింహారెడ్డి, వ్యాపారి

ఎమ్మెల్యే: రైతు బజారు ఏర్పాటుకు మనకు అవకాశం ఉంది. 50 సెంట్ల ఖాళీ స్థలం ఉంటే చూడమని కమిషనర్‌ను కోరుతున్నాం. స్థలం కేటాయించగానే రైతు బజారు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాము.

ఇల్లు, పింఛన్ ఇప్పించండి..

నాకు ఇల్లు లేదు. కొన్నేళ్లుగా అధికారులు, రాజకీయ నాయకులను అడుగుతున్నాను. ఎవరూ పట్టించుకోవడం లేదు. పింఛన్ కూడా రావడం లేదు. డబ్బు అవసరమొస్తే ఇబ్బందులు పడుతున్నాను. నాకు ఒక గూడు ఏర్పాటు చేసి, పింఛన్ ఇప్పిస్తే బతుక్కుంటాను.

- నాగమ్మ, ఆదర్శనగర్, అనంతపురం

ఎమ్మెల్యే: మీకు న్యాయం జరుగుతుంది. నగరవాసులకు 880 ఇళ్లు మంజూరయ్యాయి. మీకు స్థలం ఉంటే ఇంటిని మంజూరు చేయిస్తాం. స్థలం లేకుంటే.. స్థలం చూపించి ఇల్లు కట్టించి ఇస్తాం. పింఛన్ మంజూరు చేయిస్తాం.

ఉపాధి చూపండి

ఆదర్శ కాలనీలో నిరుద్యోగులు చాలా మంది ఉన్నారు. టీడీపీ ప్రభుత్వంలో సీమెన్స్‌తో ఒప్పందం చేసుకుని రూ.5 కోట్ల కంప్యూటర్ పరికరాలు కొనుగోలు చేశారు. అవి ఐదారేళ్లుగా జేఎన్‌టీయూలో నిరుపయోగంగా ఉన్నాయి. కాలనీలో సెంటర్ ఏర్పాటు చేసి, వాటి ద్వారా నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి, ఉపాధి చూపండి.

- వన్నూరప్ప, అనంతపురం

ఎమ్మెల్యే: జేఎన్‌టీయూ వీసీతో మాట్లాడి ఆదర్శ నగర్‌కు కంప్యూటర్లు తెప్పిస్తాం. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ కూడా ఏర్పాటు చేయిస్తాం. యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి మార్గాలను చూపిస్తాం.

రొమ్ము క్యాన్సర్‌తో...

సార్..! నేను రొమ్ము క్యాన్సర్‌తో ఇబ్బంది పడుతున్నాను. నాకు ఇద్దరు పిల్లలున్నారు. కూలి పనులు చేసుకుంటూ వారిని పోషిస్తున్నాను. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాను. నాకు పింఛన్ ఇప్పించి ఆదుకోండి సార్.

- రమ, కూలీ, అనంతపురం

ఎమ్మెల్యే: ప్రభుత్వం తరఫున ఏమాత్రం అవకాశమున్నా వైద్యానికి సాయం చేస్తాం. పింఛన్ అందించి ఆదుకుంటాం.

మా అన్నకు పింఛన్ ఇప్పించండి..

సార్..! మా అన్న పేరు గణేష్. 90 శాతం వైకల్యం ఉంది. మాకు అమ్మ, నాన్న లేరు. అన్నను నేను చూసుకుంటున్నాను. సదరం సర్టిఫికెట్ కావాలని అడిగితే అధికారులు ఒకరి మీద ఒకరు చెప్పుకుంటున్నారు. పుట్టపర్తి డీఎంహెచ్‌ఓ ఆఫీస్‌కు వెళ్లమని చెప్పారు. పలుమార్లు తిరిగినా వారు పట్టించుకోవడం లేదు. చాలా ఇబ్బంది ఉంది. మా అన్నకు పింఛన్ ఇప్పించండి సార్.

-సాయికుమార్, ఆదర్శనగర్, అనంతపురం

ఎమ్మెల్యే: డీఎంహెచ్‌ఓతో మాట్లాడి మీ సమస్యను పరిష్కరిస్తాం. పుట్టపర్తిలో కాకుండా అనంతపురంలోనే సదరం సర్టిఫికెట్ ఇప్పించి ఫించన్ ఇప్పిస్తాం.

సెల్ టవర్ తొలగించండి

సార్..! 32వ డివిజన్‌లో సెల్ టవర్లు అధికమయ్యాయి. ఎక్కడా చూసినా సెల్ టవర్లు ఉన్నాయి. రేడియేషన్ ఎక్కువవుతోంది. కాలనీలో ఎంతో మంది క్యాన్సర్ బారిన పడ్డారు. నొప్పులతో ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పరిష్కరించి ఆదుకోండి.

- రవిశంకర్, ఆదర్శనగర్, అనంతపురం

ఎమ్మెల్యే: సెల్ టవర్ల సమస్య ఆదర్శనగర్‌లోనే కాదు... దేశవ్యాప్తంగా ఉంది. టెక్నికల టీమ్‌తో మాట్లాడి.. ఒకే టవర్ మీద అన్నింటినీ ఏర్పాటు చేయిస్తాం.


అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

కొత్తచెరువు నుంచి గోరంట్ల పల్లికి వెళ్లే రోడ్డు పనులు చేపట్టారు. అయితే కొంత వరకే చేసి వదిలేశారు. దీంతో దారి లేక ఇబ్బందులు పడుతున్నాం.

-శీనా, కురుబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్

నాగరాజు, పంచాయతీరాజ్ జేఈ: రహదారి పనులకు సబంధించి బిల్లులు కాకపోవడంతో కాంట్రాక్టర్ అర్ధంతరంగా పనులు ఆపేశారు. దీంతో రహదారి నిర్మాణం జరగలేదు. ఈవిషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. దీనిపై ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి, మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి స్పందిస్తూ ఉపాధి నిధులతో రహదారి, బ్రిడ్జి పనులు చేపట్టే విధంగా ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు.

పంచాయతీలోని సమస్యలు ఇవే

ఎన్టీఆర్ కాలనీలో విద్యుత్ స్తంభాలు, లైట్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలి. వీధిలైట్లు లేకపోవడంతో మా పిల్లలు ట్యూషన్ నుంచి రాత్రి సమయంలో రావడానికి ఇబ్బందులు పడుతున్నారు. వారిని పిలుచుకురావడానికి టార్చిలైట్ తీసుకుని వెళ్లాల్సి వస్తోంది.

- షాబీర

శ్రీనివాసరెడ్డి, ఈఓ: ఎన్టీఆర్ కాలనీలో విద్యుత్ స్తంభాలు లేక లైట్లు వేయలేకపోయాం. అవసరమైన పనులకు ప్రతిపాదనలు పంపి మంజూరైన వెంటనే పనులు చేపడుతాం. డ్రైనేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు రాగానే ఏర్పాటు చేయిస్తాం.

డ్రైనేజీ లేక రోడ్డుపై మురుగునీరు నిల్వ ఉండి మడుగును తలపిస్తోంది. దీంతో దోమలు అధికమై రోగాల బారిన పడుతున్నాం. కుమ్మరకాలనీ నుంచి వేణుగోపాల్‌నగర్‌కు వెళ్లే రహదారి అక్రమ కట్టడాలతో కుంచించుకుపోయింది. ఈ సమస్యను పరిష్కరించాలి.

- కుళ్లాయప్ప

శ్రీనివాసరెడ్డి, ఈఓ: వేణుగోపాల్‌నగర్‌లో 300 మీటర్లు సీసీ రోడ్లు వేశాం. మిగిలిన 300 మీటర్ల సీసీరోడ్డుకు, డ్రైనేజీలకు ప్రతిపాదనలు పంపాం. మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం. రెవెన్యూ అధికారులతో కలిసి కుంచించుకుని పోయిన రోడ్లను సర్వే చేయించి అక్రమ కట్టడాలను తొలగించి వెడల్పు చేస్తాం.

గ్రామంలో 120 రజక కుటుంబాలు ఉన్నాయి. ఇంతవరకు ఒక్క దోబీఘాట్ కూడా లేదు. వెంటనే దోబీ ఘాట్‌ను ఏర్పాటుచేయించాలి. అర్ధసెంటులో నివాసముంటున్నాం. మాకు ఇళ్లపట్టాలు కేటాయించాలి

- చాకలి సుబ్బరాయుడు, మాజీ వార్డు మెంబరు

డీటీ, ఈఓ: రెవెన్యూ అధికారుల తో కలిసి స్థలాన్ని గుర్తించి దోబీఘాట్ ఏర్పాటుకు కృషిచేస్తాం. ఇళ్లస్థలాలు లేనివారు దరఖాస్తులు చేసుకుంటే అర్హులైన వారికి స్థలాలను కేటాయించే విధంగా చూస్తాం.

బీసీ కాలనీలో ఆక్రమణలను తొలగించాలి. నెహ్రూ సర్కిల్ నుంచి ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వరకు రోడ్డు పక్కన ఉన్న దుకాణాలను తొలగించాలి. వీటి వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

- శేషాద్రినాయుడు, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్

ఈఓ: బీసీకాలనీలో రోడ్లు ఆక్రమణలకు గురైన మాట వాస్తవమే. మేము ఇది వరకే అక్రమ నిర్మాణాలు తొలగించుకోవాలని నోటీసులు ఇచ్చాం. మరోసారి సర్వే చేయించి ఆక్రమణలను తొలగిస్తాం. అదేవిదంగా పాఠశాలల ప్రహరీ పక్కన ఏర్పాటు చేసుకున్న దుకాణాల యజమానులకు నోటీసులు పంపి వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లను రెవెన్యూ అధికారులతో కలిసి చూపిస్తాం.

మాకాలనీలో డ్రైనేజీ లేకపోవడంతో రోడ్లపై మురుగు నీరు పారుతోంది. ఈ సమస్యను పరిష్కరించండి.

- పురాణం దివ్యతేజ, బీజేపీ లీగల్ సెల్ పార్లమెంట్ కో కన్వీనర్

ఈఓ: గ్రామంలోని సీసీరోడ్లకు ఇరు వైపులా డ్రైనేజీ కాలువల నిర్మాణం చేపట్టేందుకు రోడ్లను పరిశీలించాం. వాటికి ప్రతిపాదనలు పంపాం. నిధులు రాగానే డ్రైనేజీలు నిర్మాణం చేపడతాం.

హంద్రీనీవా వెడల్పు పనులు

వేగంగా చేపట్టాలి

- ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్



అధికారులతో మాట్లాడుతున్న రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

అనంతపురం అర్బన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) కాలువ వెడల్పు పనులు వేగంగా చేపట్టాలని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అధికారులను ఆదేశించారు. స్థానిక ఆర్అండ్బీ అతిథి గృహంలో మంగళవారం సాయంత్రం ఆయన హెచ్ఎన్ఎస్ఎస్ ప్రాజెక్టు కింద 36ఏ ప్యాకేజి, కాలువ వెడల్పు తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. హెచ్ఎన్ఎస్ఎస్ కింద మల్యాల నుంచి జీడిపల్లి వరకు కాలువ వెడల్పు జరుగుతోందని, అందులో జంగిల్ క్లియరెన్స్ పనులు వేగంగా చేపట్టాలన్నారు. జంగిల్ క్లియరెన్స్‌కు ముందు, పనులు చేసిన తర్వాత డ్రోన్ ద్వారా ఫొటోలు తీయించాలన్నారు. అవసరమైన భూసేకరణకు సంబంధించి పరిహారం చెల్లించేం దుకు సీఎఫ్ఎంఎస్‌లో ఎక్కించాలని ఆదేశించారు. కాలువ వెడల్పునకు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను వెంటనే తొలగించాలన్నారు. భూసేకరణ ఎక్కడ వరకు ఉందో అక్కడ పెడ్ మార్కింగ్ చేయాలన్నారు. ఎక్కడ సమస్యలున్నాయో అక్కడ పెడ్ మార్కింగ్ చేసి పనులు మొదలు పెట్టాలన్నారు. హెచ్ఎన్ఎస్ఎస్ కింద 33, 34 ప్యాకేజీలలో కూడా జంగిల్ క్లియరెన్స్ చేయాలని ఆదేశించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి నియోజకవర్గంలో, ఇతర చోట్ల అవసర మైన భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో కర్నూలు హెచ్ఎన్ఎస్ఎస్ సూపరింటెండెంట్ వరప్రసాద్, హెచ్ఎన్ఎస్ఎస్ భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జున, గుంతకల్లు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్‌నాయక్, కర్నూలు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రశేఖర్, ఏపీ ఎస్పీడీసీఎల్ కళ్యాణదుర్గం ఈఈ శేషాద్రి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్ల అభివృద్ధిపై దృష్టి పెట్టండి

అనంతపురం అర్బన్ జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఉరవకొండ నియోజకవర్గంలో గ్రామీణ రహదారుల అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అధికారులను ఆదేశించారు. స్థానిక ఆర్అండ్బీ అతిథి గృహంలో మంగళవారం రాత్రి పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో మంత్రి సమీక్షించారు. నియోజకవర్గంలోని రహదారులను మూడు భాగాలుగా విభజించుకుని పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. రహదారుల అభివృద్ధికి అవసరమైన నిధుల మంజురుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉదిరిపికొండ- ఉరవకొండ పైపులైన్ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మార్చిలోగా పనులు పూర్తి చేస్తామని అధికారులు సమాధానం ఇచ్చారు.

జంబూరి ఉత్సవాలకు జిల్లా విద్యార్థులు



డైమండ్ జూబ్లీ జంబూరి ఉత్సవాలకు ఎంపికైన స్కౌట్స్ అండ్ గైడ్స్

కుందుర్పి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులో జరిగే డైమండ్ జూబ్లీ జంబూరి ఉత్సవాలకు జిల్లా నుంచి 13 మంది స్కౌట్స్ విద్యార్థుల, 19 మంది గైడ్స్ విద్యార్థులు, ఉపాధ్యాయులు వెళ్లారు. భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ నేషనల్ హెడ్ క్వార్టర్స్ వారి ఆధ్వర్యంలో 75వ వార్షికోత్సవాలు తిరుచనాపల్లిలో జరగనున్నాయి. జనవరి 28 నుంచి ఫిబ్రవరి 3 వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ పూర్వ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెద్దిరెడ్డి, కార్యదర్శి బొమ్మయ్య మాట్లాడుతూ జాంబూరి అనేది స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు ఒక పండుగ లాంటిదన్నారు. భారతదేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులు సంస్కృతి, సంప్రదాయాల ప్రదర్శన చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో దాదాపుగా 25 వేల మంది పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయ్‌కుమార్, శైలజ, కమలాక్షి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వైసీపీ నాయకుడి అరెస్ట్.. బెయిల్

పెద్దవడుగూరు, జనవరి28(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపల్లి గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు గూడూరు సూర్యనారాయణ రెడ్డిని పెద్దవడుగూరు పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ శ్రీనివాసులు తన సిబ్బందితో వెళ్లి హైదరాబాదులో ఉంటున్న సూర్యనారాయణరెడ్డిని గత అర్ధరాత్రి అదుపులోకి తీసుకున్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యపరీక్షలు నిర్వహించిన తర్వాత రిమాండ్‌కు తరలించారు. 2018లో ఉపాధి పథకం, 14వ ఆర్థిక సంఘం నిధులతో లక్ష్మీపల్లి గ్రామంలో సిమెంట్ రోడ్ల పనులను అప్పేచర్ల గ్రామానికి చెందిన చంద్ర అనే వ్యక్తి చేపట్టారు. అందుకు సంబంధించిన మొత్తం రూ.14,85,495. వైసీపీ అధికారంలోకి రావడంతో పంచాయతీ సెక్రటరీ మురళీకృష్ణారెడ్డి నిధులు కాజేశాడని జిల్లా కలెక్టర్‌కు కొందరు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేయగా, నిధులు దుర్వినియోగమైనట్లు గుర్తించి, పంచాయతీ సెక్రటరీని సస్పెన్షన్ చేశారు. దీంతో ఆయన మండల వైసీపీ వైసీపీ రైతు విభాగం మాజీ రాష్ట్ర కార్యదర్శి గూడూరు సూర్యనారాయణరెడ్డి తనపై ఒత్తిడి తెచ్చి, చెక్కులను తీసుకున్నట్లు అధికారులకు రాతమూలకంగా ఫిర్యాదు చేశాడు. దీంతో ఎంపీడీఓ నరసింహారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈకేసు విషయంగానే సూర్యనారాయణరెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే ఆయనకు గుత్తికోర్టు బెయిల్ మంజూరు చేసింది. వైసీపీ నాయకుడిని అరెస్ట్ చేశారనే సమాచారంతో వైసీపీ నాయకులు, కార్యకర్తలు మండలకేంద్రానికి చేరుకున్నారు. పోలీసులు అప్రమత్తమై ఎలాంటి సంఘటనలో చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టారు.



బెయిల్‌పై విడుదలైన వైసీపీ నాయకుడు

పట్టించుకునేది ఎప్పుడో ?

చెరువులకు రక్షణ కరువు

కట్టలపై పెరిగిన కంప చెట్లు

మరమ్మతులు లేక తూముల నుంచి లీకేజీ



అరవకూరు చెరువు కట్టకు ఇరువైపులా పెరిగిపోయిన కంపచెట్లు



పొట్టి చెరువు తూము నుంచి లీకేజీ అవుతున్న నీరు

కూడేరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాయల కాలం నాటి చెరువులు మరమ్మతులకు నోచుకోకపోవడంతో కట్టలు, తూములు దెబ్బతింటున్నాయి. మండలంలో ఇప్పేరు, మరుట్ల, అరవకూరు, పొట్టి చెరువు, కరుట్లపల్లి, కొర్రకోడు చెరువుతోపాటు కూడేరు సమీపంలోని ఓబులయ్యకుంట, ముద్దలాపురం పర్క్యులేషన్ ట్యాంకులు ఉన్నాయి. వీటిలో ప్రధానంగా ఇప్పేరు, మరుట్ల, అరవకూరు, పొట్టి చెరువుల కింద ఆయకట్టు సాగు అవుతుంది. వర్షాలకు చెరువు నిండి నీరు నిల్వ ఉంటే ఆయకట్టు కింద రైతులు వరి, గోధుమ, జొన్న, రాగి తదితర పంటలు సాగు చేస్తారు. రాను రాను వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో చెరువులో నీరు నిల్వ లేకుండా పోయింది. దీంతో చెరువుల ఆలనా పాలన పట్టించుకోనే నాథుడే లేకుండా పోయారు. దీంతో చెరువు కట్టలకు ఇరువైపులా కంపచెట్లు ఏపుగా పెరిగిపోయాయి. వాటిని ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో వేర్లు చొచ్చుకుపోయి చెరువు కట్ట పటిష్టతను దెబ్బతీస్తున్నాయి. దీంతో చెరువులో నీరు నిల్వ చేస్తే దెబ్బతిన్న కట్ట నుంచి నీరు వృథాగా బయటకు వెళ్తోంది. దీనికి తోడు తూములు కూడా దెబ్బతినడంతో వాటి ద్వారా నీరు లీకవుతోంది. మరమ్మతుల గురించి ఎవరు , ఎప్పుడు పట్టించుకుంటారో తెలియని పరిస్థితి నెలకొందని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హంద్రీ- నీవా, పీఏబీఆర్ నీటితో చెరువులు కళకళ

హంద్రీనీవా, పీఏబీఆర్ నుంచి సమృద్ధిగా నీరు రావడంతో మండలంలో ఇప్పేరు, మరుట్ల, అరవకూరు, పొట్టిచెరువు, కరుట్లపల్లి, ముద్దలాపురం చెరువులు కళకళలాడుతున్నాయి. కూటమి పార్టీలు అధికారంలోకి రాగానే ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మండలంలోని అన్ని చెరువులను నీటితో నింపేందుకు శ్రద్ధ తీసుకున్నారు.

పెరిగిన ఆయకట్టు

మండలంలో చెరువుల కింద ఉన్న ఆయకట్టు భూములు వరి పంటతో కళకళలాడుతున్నాయి. మరుట్ల చెరువు కింద 120 ఎకరాలు, అరవకూరు చెరువు కింద 340 ఎకరాలు, పొట్టి చెరువు కింద 141 ఎకరాలు, కరుట్లపల్లి చెరువు కింద 30 ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. చెరువుల్లో నీరు ఉండటంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో భూగర్భజలాలు పెరిగాయి. దీంతో ఆయకట్టు పరిధిలోకి రాని వందల ఎకరాల భూమిలో పంటలు సాగు చేస్తున్నారు. ఆయా చెరువుల కింద వరి పంట పెద్ద ఎత్తున సాగు చేస్తున్నారు. చెరువులో నీరు నిల్వ ఉండటంతో సమీపంలోని బోరు బావుల్లో నీరు పుష్కలంగా పెరగడంతో అన్నదాతలు చీనీ, దానిమ్మ, ద్రాక్ష, వేరుశనగ, కర్బూజ, కలింగర, దోస తదితర పంటలతోపాటు ఆకు కూరలు, కూరగాయలు సాగు చేస్తున్నారు.

● కట్ట వెడల్పు చేయాలి



పూర్వకాలంలో నిర్మించిన ఇప్పేరు చెరువుకట్ట చిన్నగా ఉండటంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీనికితోడు కంప చెట్లు పెరిగిపోవడంతో సమస్య మరింత తీవ్రమవుతోంది. గతంలో చెరువులో పూడికతీత పనులు చేశారు. దీంతో చెరువులో ఎక్కువ నీరు నిల్వ ఉంది. చెరువు కట్ట మరమ్మతులకు నిధులు అందించి కట్ట వెడల్పు చేస్తే అన్నదాతలకు పొలల్లోకి వెళ్లేందుకు ఇబ్బందులు తప్పుతాయి.

- రమణ, రైతు ఇప్పేరు గ్రామం

● కంప చెట్లు తొలగించాలి



అరవకూరు చెరువు కట్ట ఇరువైపులా కంపలు తొలగించాలి. చెరువులో నీరు నిల్వ ఉంటే ఆయకట్టుతోపాటు బోరుబావుల్లో నీరు సంవృద్ధిగా పెరిగి రైతులు పంటలు పండిస్తారు. ప్రస్తుతం చెరువు కింద ఆయకట్టు సాగు ఊపందుకుంది. రైతులు వరిపంట పెద్ద ఎత్తున్న సాగు చేస్తున్నారు. చెరువులో పూర్తి స్థాయి నీరు ఉంటే రెండు పంటలు పండించుకుంటాం. అందుకు ప్రభుత్వం చెరువు కట్టతోపాటు తూములు, మరవల మరమ్మతులకు నిధుల కేటాయించి పనులు చేయించాలి.

- రమేష్, రైతు కమ్మూరు గ్రామం

● నివేదికలు పంపాం



కూడేరు మండలంలోని చెరువుల మరమ్మతులకు ప్రభుత్వానికి నివేదికలు పంపాం. ఒక్కొక్క చెరువుకు ఖరీఫ్ సీజన్‌లోపు ఐదు లక్షలతో పనులు చేయడానికి ప్రతి పాదన లు పంపిచాం. ఇప్పేరు చెరువుకు రూ.1.06 కోట్లు, పొట్టి చెరువుకు రూ.48లక్షలు, అరవకూరు చెరువుకు రూ.30 లక్షలు, మరుట్ల చెరువుకు రూ.42లక్షలు, కరుట్లపల్లి చెరువుకు రూ.60 లక్షలు కావాలని నివేదికలు పంపించాం. నిధులు రాగానే లీకేజీలు, కట్ట భద్రత, తూముల రిపేరీ తదితర పనులు పూర్తి చేస్తాం.

- సుధాకర్, ఏఈ, మైనర్ ఇరిగేషన్

నెత్తురోడిన రోడ్లు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురి మృతి

వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉమ్మడి జిల్లాకు చెందిన ఐదుగురు మృతి చెందారు. అలాగే ఉత్తరప్రదేశ్‌కు చెందిన మరో యువకుడు మృతి చెందాడు. ఈ దుర్ఘటనల్లో ముగ్గురు తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు మంగళవారం వెల్లడించారు. క్షతగాత్రులు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మృతుల్లో ముగ్గురు యువకులు, ఓ మహిళ, వృద్ధురాలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి భర్తకు గాయాలు

గుత్తి రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం పోతుదొడ్డి గ్రామశివారులో 44వ జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీలత(38) మృతి చెందారు. కార్తీక్ గాయపడ్డాడు. ప్యాపిలి ఎస్ఐ మధుసూదన్ తెలిపిన మేరకు మేరకు శ్రీసత్యసాయి జిల్లా కదిరికి చెందిన కార్తీక్, శ్రీలత దంపతులు కారులో హైదరాబాదు నుంచి సొంతూరికి వస్తున్నారు. పోతుదొడ్డి దగ్గరకు రాగానే కారు బోల్తా పడింది. దీంతో దంపతులిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గుర్తించి గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీలత మృతి చెందింది. ఈ సంఘటపై ప్యాపిలి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

బైకు అదుపుతప్పి యువకుడు ...



సాయిరాం(ఫైల్)

డి.హీరేహాళ్ మండలంలోని హడగలి గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడిన ప్రమాదంలో సాయిరాం(23) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు కర్ణాటక బళ్లారి ప్రాంతానికి చెందిన ఆంజనేయులు కుమారుడు సాయిరాం రాయదుర్గం వైపు ద్విచక్ర వాహనంపై బయల్దేరాడు. హడగలి గ్రామ సమీపంలో కుక్కను తప్పించే క్రమంలో కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన యువకుడిని బళ్లారి ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందినట్లు పోలీసులు తెలియజేశారు. మృతుడి తండ్రి ఆంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గురుప్రసాద్ రెడ్డి తెలియజేశారు.

ఐషర్ ఢీకొని వృద్ధురాలు..

ఉరవకొండ మండలంలోని చిన్నముష్టూరు గ్రామంలోని కళ్యాణదుర్గం కూడలి వద్ద మంగళవారం ఐషర్ వాహనం ఢీకొని సుభద్రమ్మ(77) మృతి చెందింది. సుభద్రమ్మ రోడ్డు దాటుతున్న సమయంలో అనంతపురం నుంచి బళ్లారి వైపునకు వెళ్తున్న ఐషర్ వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆమెను ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. ప్రమాదం జరిగిన వెంటనే ఐషర్ వాహనం డ్రైవర్ పరారయ్యాడు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నారు.

యూపీ యువకుడు..

గోరంట్ల: మండలంలోని పాలసముద్రం వద్ద గల నాసిన్ అకాడమీ క్యాంపస్‌లో జరిగిన ద్విచక్రవాహన ప్రమాదంలో గాయపడిన యుపీ యువకుడు ఆనంద్‌యాదవ్(18)హిందూపురం ఆసుపత్రిలో సోమవారం రాత్రి మృతి చెందినట్లు సీఐ శేఖర్ తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లోని మావ్‌జిల్లా కటిహారి గ్రామానికి చెందిన జిందుయాదవ్ కుమారుడు ఆనంద్‌యాదవ్ తన బంధువైన రవికుమార్‌ను కలిసేందుకు వచ్చాడు. రవికుమార్ నాసిన్ అకాడమీలో కూలీగా పని చేస్తున్నాడు. అకడమీలో సోమవారం కలిసిన ఇద్దరూ ద్విచక్రవాహనంపై నాసిన్ క్యాంపస్‌లోకి వెళ్తుండగా ప్రమాదవశాత్తు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టారు. వాహనాన్ని నడుపుతున్న ఆనంద్‌యాదవ్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని హిందూపురం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. తండ్రి బిందుయాదవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బైక్ బోల్తా పడి యువకుడు... - మరో యువకుడికి గాయాలు

గుత్తి మండలంలోని రజాపురం గ్రామ శివారు 67వ జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో చాకలి పవన్ (25) మృతి చెందాడు. మరో యువకుడు గాయపడ్డాడు. టీ. కొత్తపల్లి గ్రామానికి చెందిన చాకలి పవన్, కడియల పవన్ ఇద్దరు కలిసి బైక్‌పై గుంతకల్లుకు వెళ్లి గుత్తికి వస్తుండగా రజాపురం గ్రామ శివారులో బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో చాకలి పవన్ అక్కడికక్కడే మృతి చెందాడు. కడియాల పవన్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

రామదాసుపేట వద్ద యువకుడు...



శర్మాష్‌వలి (ఫైల్)

గార్లదిన్నె మండలంలోని రామదాసుపేట సమీపంలో 44వ జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐషర్ వాహనం డ్రైవర్ శర్మాష్‌వలి (20) దుర్మణం చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు అనంతపురం రూరల్ మండలం కొడిమి కొట్టాలకు చెందిన దస్తగిరమ్మ, ఎర్రిస్వామి దంపతుల కుమారుడు శర్మాష్‌వలి ఐషర్ డ్రైవర్‌గా పని చేసేవాడు. ద్విచక్ర వాహనంపై మంగళవారం రాత్రి పామిడి వైపు నుంచి అనంతపురం వైపు బయల్దేరాడు. రామదాసుపేట సమీపంలో మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు. శర్మాష్‌వలి ద్విచక్ర వాహనాన్ని ఏదైనా వాహనం ఢీ కొట్టిందా...? లేక ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడిందా...? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

నార్పల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసాపురం గ్రామ సమీపంలో గుర్తుతెలియని మృతదేహం మంగళవారం మధ్యాహ్నం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. దాదాపు 45సంవత్సరాల వయస్సు గల వ్యక్తి మృతదేహం నరసాపురం సమీపంలో లభించింది. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతదేహంపై నీలం రంగు డ్రాయర్, గళ్ల లుంగీ, చొక్కా ఉన్నాయి. ఎవరైనా గుర్తిస్తే నార్పల పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ సాగర్ తెలిపారు. మృతదేహాన్ని అనంతపురం వైద్యకళాశాలకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

రాప్తాడు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం రాలేదనే మనస్తాపంతో అనంతపురం నగరానికి చెందిన యువకుడు జయచంద్ర (25) ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... నగరానికి చెందిన లక్ష్మయ్య, రత్నమ్మల కుమారుడు జయచంద్ర బెంగళూరులో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తి చేశాడు. ఉద్యోగం రాకపోవడంతో మనస్తాపం చెందాడు. ఈక్రమంలోనే ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. జయచంద్ర మృతదేహం రైలు పట్టాలపై పడి ఉండటాన్ని మంగళవారం రైల్వే పోలీసులు గమనించారు. మృతుడి సెల్‌ఫోన్ ట్రూ కాలర్ ఆధారంగా జయచంద్ర అని గుర్తించారు. అవివాహితుడైన జయచంద్ర మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

టమోటా కిలో రూ.16



అనంతపురం రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 16తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు మంగళవారం 675 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 12, కనిష్ఠ ధర రూ. 9 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ. 15వేలు



అనంతపురం రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 15వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 10వేలు, సరాసరి రూ. 11వేలుతో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం ఆరు టన్నుల చీనీ కాయలు వచ్చాయన్నారు.

ఒకటో తేదీనే పింఛన్: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ ఒకటో తేదీన పకడ్బందీగా చేపట్టాలని అధికారులను కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి మంగళవారం ఆయన ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, డీఆర్‌డీఏ అధికారులు, ఏపీఎంలు, బ్యాంకు, మండల స్పెషల్ ఆఫీసర్లతో కలెక్టరు కాన్ఫరెన్స్ నిర్వహిం చారు. ఈసందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ జనవరి నెల పింఛన్లను ఫిబ్రవరి ఒకటో తేదీనే పంపిణీ చేస్తామన్నారు. ఇందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం మంజూరు చేసినట్లు వెల్లడించారు. పింఛన్లకు సంబంధించిన డబ్బును ముందుగానే బ్యాంకుల నుంచి డ్రా చేసి, పంపిణీకి సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఒకటిన ఉదయం 6 గంటల నుంచి పింఛన్ల పంపిణీ మొదలు పెట్టి మధ్యాహ్నానికి పూర్తి చేయాలని ఆదేశించారు. లబ్ధిదారుల ఇళ్లవద్దకే వెళ్లి పింఛన్ అందించాలన్నారు. ఎక్కడ నుంచి జియోట్యాగ్ చేశారో అక్కడకు వెళ్లి పంపిణీ చేయాలని సూచించారు. మండల స్థాయిలో కంట్రోల్‌రూమ్‌లు ఉదయంనుంచే ఏర్పాటుచేయాలని స్పెషల్ అధికారులకు ఆదేశించారు. అదేరోజు ఆయామండలాలలో జరుగుతున్న అబివృద్ధిపనులను పరిశీలించాలన్నారు. ఇళ్లనిర్మాణాలు పూర్తీ అయిఉంటే లబ్దిదారులకు తాలాలు అందించాలని కలెక్టరు అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏపీడీ ఈశ్వరయ్య, ఎల్డీఎం నరసింగరావు,హౌసింగ్‌పీడీ శైలజ, జడ్పీడిప్యూటీ డీఈఓ వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

రిజర్వాయరుకు ఇన్‌ఫ్లో 902 క్యూసెక్కులు

బెళుగుప్ప, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు ఇన్‌ఫ్లో 902 క్యూసెక్కులు ఉన్నట్లు మంగళవారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 463 క్యూసెక్కులు వెళుతున్నాయి. ప్రస్తుతం రిజర్వాయరులో 1.681 టీఎంసీల నీరు నిల్వ వుందని అధికారులు వెల్లడించారు.

న్యూస్ బాక్స్

సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు



ఆత్మకూరు జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలను అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామంలో గ్రామదేవర సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. స్వామివారని ప్రత్యేకంగా అలంకరించి భక్తులు దర్శనం కల్పించారు. భక్తులతో అలయం నిండిపోయింది. కార్యక్రమంలో కార్యనిర్వహణాఅధికారి బాబు,ప్రదాన అర్చకులు రాముస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుంకులమ్మ జాతర

శింగనమల, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లుమడి గ్రామంలో సుంకులమ్మ జాతరను భక్తులు ఘనంగా నిర్వహించారు. జాతర సందర్భంగా మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూగజీవాలను బలి ఇచ్చారు. టీడీపీ సీనియర్ నాయకుడు ముంటిమడుగు కేశవరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి డేగల కృష్ణమూర్తి, దక్షిణ కాలువ ఉపాధ్యక్షుడు కుమ్మెత చంద్రాయుడు, ఈశ్వర్‌రెడ్డి చితంబరిదొర, చిదా నందనాయుడు, గుర్రం లక్ష్మీనారాయణ, పెదిరెడ్డి శశి నాయుడు, చిట్టినాయుడు, ఓబిరెడ్డి, రాజు, విజయ్ అమ్మవారిని దర్శించుకున్ని పూజలు చేశారు.

గ్రంథాలయ పన్నులు వసూలు చేయాలి : కార్యదర్శి

కనగానపల్లి/రామగిరి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ పన్నులు వెంటనే వసూలు చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి. రమ గ్రంథాలయ అధికారులకు సూచించారు. ఆమె మంగళవారం మండలకేంద్రాలైన కనగానపల్లి, రామగిరిలో గ్రం థాలయాలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. పరీక్షలకు ఉపయోగపడే అన్నిరకాల పుస్తకాలను అందుబాటులో ఉంచుకోవాలని కనగానపల్లి గ్రంథాలయాధికారి గోవిందు, రామగిరి గ్రంథాలయాధికారి వెంకటేశ్‌కు ఆమె సూచించారు. పెండింగ్‌లో ఉన్న పన్నులు వసూలు చేయాలని తెలిపారు.

మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం

అనంతపురం సెంట్రల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు ప్రకటించిన సందర్భంగా మంగళవారం అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి దళిత సంఘాల ఆధ్వర్యంలో క్షీరాభి షేకం చేశారు. కేక్ కట్‌చేసి వేడుకలు నిర్వహించారు. ఎమ్మార్పీ ఎస్, ఎమ్మెస్పీ, వీహెచ్‌పీఎస్, ఎంఎంఎస్, ఎంకేఎస్ సంఘాల సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకులకు ఆయా సం ఘాల నాయకులు కేబీ మధు, పెద్దన్న, స్వతంత్రకుమారి హాజరై మాట్లాడారు. నాయకులు జానకీరామయ్య, పుల్లన్న, బాలరాజు, వరలక్ష్మి, సంధ్య, చెన్నరాయుడు, నరసింహప్ప, రెడ్డప్ప, అంజనేయులు, నాగమ్మ, పద్మావతి, రత్నమ్మ, పూజ పాల్గొన్నారు.

స్క్రీనింగ్ పరీక్షలు నాణ్యతగా చేపట్టాలి

గార్లదిన్నె, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఇంటింటా సర్వేలో అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్ పరీక్షలు నాణ్యంగా చేపట్టాలని జిల్లా ఇన్‌చార్జ్ వైద్యాధికారి, అసంక్రమిత వ్యాధుల నిర్వహణ కార్యక్రమాల వైద్యాధికారి నారాయణస్వామి వైద్యులకు సూచిం చారు. ఆయన మంగళవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ సంచార వాహన వైద్య సేవలను గార్లదిన్నెలో సందర్శించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు రాష్ట్రీయ బాలల స్వాస్థ్ కార్యక్రమం ద్వారా చేపట్టిన స్క్రీనింగ్ పరీక్షలను పరి శీలించారు.

కడియాల కొండన్న ప్రమాణ స్వీకారం



కడియాల కొండన్నను సన్మానిస్తున్న నాయీబ్రాహ్మణులు

అనంతపురం అర్బన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా కడియాల కొండన్న ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మంగళవారం నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ సదాశివం, ఇతర డైరెక్టర్లతో కలిసి కడియాల కొండన్న ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా పలువు రు నాయీబ్రాహ్మణులు, టీడీపీ నాయకులు ఆయనకు పూల మాల వేసి సన్మానించారు. ఈ సందర్భంగా కడియాల కొండన్న మాట్లాడుతూ... తనకు డైరెక్టర్ పదవి అప్పగించినందుకు ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా నాయీబ్రాహ్మణుల సంక్షేమంతోపాటు పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానన్నారు.

రోడ్డు నిబంధనలపై అవగాహన పెంచుకోవాలి

● ఎంవీఐ శ్రీనివాసులు

అనంతపురం అర్బన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత నియమాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ఎంవీఐ డి. శ్రీనివాసులు సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక రెండో రోడ్డులోని గాయత్రి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంవీఐ శ్రీనివాసులు మాట్లాడుతూ... రోడ్డు భద్రతా నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలు నివారించవచ్చునన్నారు. హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలు నడపాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పాటించాల్సిన పద్ధతులను తెలుసుకొని, ఇతరులకు చెప్పడంతో పాటు ఆచరించాలన్నారు. స్కూల్ కరస్పాండెంట్ నరేంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి

అనంతపురం సెంట్రల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహన ప్రయాణాల్లో హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని ఇటుకలపల్లి ఎస్ఐ విజయ్‌కుమార్ సూచించారు. మంగళవారం అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సును నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో 'హెల్మెట్ ధరించండి-రక్షణ పొందండి' అనే అంశంపై ఏర్పాటు చేసిన సదస్సుకు హాజరైన ఎస్ఐ హాజరై మాట్లాడారు. కార్యక్ర మంలో ప్రిన్సిపాల్ రామమూర్తి, అధికారులు రామాంజినేయులు, ఖలీల్‌బాష, నవీన్‌కుమార్ తదిరులు పాల్గొన్నారు.

'గణతంత్ర వేడుకల్లో ప్రజాసేవకులకు మొండిచేయి'

అనంతపురం కల్చరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): గణతం త్ర వేడుకల్లో ప్రోత్సాహకంగా అందించే అవార్డుల విషయంలో ఈ ఏడాది ప్రజా సేవకులకు మొండిచేయి చూపడం తగదని పలువురు ప్రజాసంఘాల నాయకులు పేర్కొన్నారు. మంగళవా రం ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఐఎంఎం, ముస్లింల ఐక్యవేదిక, గరీబ్ ట్రస్టు, ప్రజాబలం సంఘాల నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమాజ హితం కోరుతూ కులమతాలకు అతీతంగా సేవాకార్యక్రమాలు చేపట్టే సామాజిక కార్యకర్తలను విస్మరించడం బాధాకరమన్నారు. ఐఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు మహబూబ్‌బాషా, జాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



గత ప్రభుత్వంలో చుక్క నీరు లేని పాముర్రాయి చెరువు



ప్రస్తుతం నీటితో తొణికిసలాడుతున్న దృశ్యం

నాడు వెలవెల.. నేడు జలకళ

అనంతపురం రూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పాముర్రాయి చెరువు వెల..వెల పోయింది. కూటమి అధికారంలోకి వచ్చాక జలకళ సంతరించుకుంది. నిండుకుండను తలపిస్తోంది. గత వైసీపీ హయాంలో చెరువు పూర్తిగా ఎండిపోయింది. దాదాపు మూడేళ్ల పాటు చుక్క నీరు లేదు. అయితే కూటమి అధికారంలోకి వచ్చాక చెరువుకు పూర్వ వైభవం వచ్చింది. స్థానిక ఎమ్మెల్యే పరిటాల సునీత చొరవతో టీడీపీ స్థానిక నాయకులు చెరవుకు హెచ్చెల్సీ నీటిని విడిపించుకోగలిగారు. దీంతో చెరువు చాలా వరకు నిండింది. నీటితో తొణికిసలాడుతోంది. మరి కొన్ని రోజుల్లో చెరువు మరువ పారే పరిస్థితి కనిపిస్తోంది. చెరువు నిండటంతో చుట్టుపక్కల గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మరో మూడేళ్ల పాటు తాగు, సాగునీటికి సమస్యకు బోకా ఉండదంటున్నారు. బోర్లలో నీరు మరింత వృద్ధి చెందాయన్న ఆశాభావం వ్యక్తం అవుతోంది. ఈక్రమంలో పాముర్రాయి, సోములదొడ్డి తదితర ప్రాంతాల పరిధిలోని దాదాపు మూడు వందల ఎకరాలకు సాగు నీటికి ఇబ్బంది ఉండదంటున్నా. చెరువుకు నీరు చేరడంతో ఇటీవల చేపల పెంపకం చేపట్టినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆరు వేల చేప పిల్లలను కొనుగోలు చేసి చెరువులో వదిలినట్లు గ్రామస్థులు చెబున్నారు. మరికొన్నింటిని వదిలేందుకు ప్రయత్నం చేస్తున్నారు.

వైసీపీలో గుబులు పుట్టించిన యువగళం

● ఎమ్మెల్యే పరిటాల సునీత



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం అర్బన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): సరిగ్గా రెండేళ్ల క్రితం నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర వైసీపీ నాయకులు గుండెల్లో రైళ్లు పరిగెత్తించిందని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం అనంతపురంలోని క్యాంప్ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. నారాలోకేశ్ యువగళం పాదయాత్ర ఆరంభించిన రోజే వైసీపీ పతనం మొదలైందన్నారు. అంతటా భయం.. ఆందోళన కమ్ముకున్న సమయంలో యువగళం పాదయాత్ర అందరిలోనూ ధైర్యం నింపిందన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందన్నారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా, అప్పటి వైసీపీ ప్రభుత్వం అనేక ఇబ్బందులు సృష్టించినా జనమే బలమై, తన పాదయాత్రను నారా లోకేశ్ జైత్ర యాత్ర గా సాగించారన్నారు. రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల్లో గత ప్రభుత్వంలో జరుగుతున్న అరాచకాలను, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సోదరుల అక్రమాలపై గళమెత్తారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా వ్యవస్థలో సమూల మార్పులు చేపట్టి, రాష్ట్రాన్ని ఐటీ హబ్‌గా మార్చేందుకు అన్ని విధాలుగా లోకేశ్ కృషి చేస్తున్నారన్నారు. అలాగే సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ పడుతున్న తపన చూస్తుంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బంగారు భవిష్యత్ కళ్ల ముందే కనిపిస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

చరిత్రలో నిలిచిపోయే పాదయాత్ర

● టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం



అనంతపురం అర్బన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నారాలోకేశ్ చేపట్టిన యువ గళం పాదయాత్ర చరిత్రలో నిలిచిపోతుందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసా నాయుడు పేర్కొన్నారు. ఆయన మంగళవారం అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. వైఎస్ జగన్ అరాచక పాలనను తుడిచిపెట్టేందుకు అప్పట్లో నారాలోకేశ్ యువగళం పాదయాత్ర చేపట్టారన్నారు. అడుగడుగునా అనేక ఆటంకాలు సృష్టించినా వెనుకడుగు వేయకుండా సాహసోపేతంగా ముందుకు సాగారన్నారు. ఆ సమయంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు ఘన విజయానికి పాదయాత్ర ఎంతగానో దోహదం చేసిందన్నారు.

పంపనూరులో ఊరి దేవర - హాజరైన ఎమ్మెల్యే

ఆత్మకూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పంపనూరులో మంగళవారం జరిగిన ఊరి దేవర కార్యక్రమానికి ఎమ్మెల్యే పరిటాల సునీత హజరయ్యారు. గ్రామంలోని టీడీపీ నాయకుల ఇళ్లకు వెళ్లి వారిని అప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఎమ్మెల్యేని, టీడీపీ మండల ఇన్‌చార్జ్ బాలాజీని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, పార్లమెంటు అధికార ప్రతినిధి శశాంక చౌదరి, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి బండి పరశురామ్, నాయకులు మారెక్క, కుల్లాయప్ప, కృష్ణమోహన్ చౌదరి, వెంకటనారాయణ, సూరి, అనీల్ చౌదరి, శ్రీనివాసరెడ్డి, కందుళ ఓబుళపతి, రవీంద్రారెడ్డి, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని తరలించొద్దు

● రేపు రౌండ్‌టేబుల్ సమావేశం: మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

అనంతపురం కల్చరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): కడపలో ఉన్న ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించకుండా యథాతథంగా ఉంచాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అది రాయలసీమకు సంబంధించిన ముఖ్యమైన బ్యాంకు అని, రాయలసీమ గ్రామీణ ప్రాంతాలకు, రైతులకు ఎంతగానో ఉపయోగపడుతోందన్నారు. గ్రామీణ బ్యాంకుల విలీన ప్రక్రియను సాకుగా చూపి ప్రధాన కార్యాలయాన్ని తరలింపు ప్రయత్నాన్ని వ్యతిరేకిస్తూ మన అభిప్రాయాన్ని ప్రభుత్వానికి తెలియజేసేందుకు గురువారం సాయంత్రం 5 గంటలకు ఎన్జీఓ హోంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని సంఘాల ప్రతినిధులు, మేధావులు పెద్దసంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

'ప్రాథమికోన్నత పాఠశాలలపై వివక్ష వద్దు'

అనంతపురం విద్య, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికోన్న పై వివక్ష చూపడం తగదని ఏపీఎస్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు విజయభాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో ఖండించారు. ప్రభుత్వం 117 జీఓ రద్దు చేసే క్రమంలో ప్రాథమికోన్నత పాఠశాలలపై విద్యాశాఖ ఉన్నతాధికారులు వివక్ష చూపుతున్నారన్నారు. విద్యార్థుల సంఖ్య 30 దాటిన ప్రాథమికోన్నత పాఠశాలలను కొనసాగిస్తామని చెప్పి.... ప్రస్తుతం మూడు కిలోమీటర్ల దూరంలోని ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయడం సరికాదన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటన చేసేలా ప్రభుత్వాన్ని కోరారు.

ఉత్తర్వులకు భిన్నంగా క్షేత్రస్థాయి ప్రయత్నాలు తగదు

అనంతపురం విద్య, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జీవో 117 రద్దు నేపథ్యంలో ఇచ్చిన మెమోకు భిన్నంగా పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కింది స్థాయి అధికారులకు ఆదేశాలు ఇస్తున్నారని, ఇది సబబుకాదని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్‌కుమార్ మంగళవా రం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 6,7,8 తరగతుల్లో విద్యార్థుల సంఖ్య 60కి మించి ఉన్న పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయాలని మెమోలో పేర్కొన్నారని గుర్తుచేశారు. మౌలిక వసతుల లేని పాఠశాలలను అప్‌గ్రేడ్ చేయకుండా ఆ తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసే విధంగా యత్నాలు చేస్తున్నారని, దీన్ని ఏపీటీఎఫ్ ఖండిస్తోందన్నారు.

డ్రైనేజీలపై దృష్టి సారించండి: మేయర్

అనంతపురం క్రైం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రధాన మురుగు కాలువలు శుభ్రంగా ఉండేలా చూడాలని నగర మేయర్ మహమ్మద్ వసీం అధికారులను ఆదేశిం చారు. నగరంలోని సుభాష్‌రోడ్డులో ప్రధాన డ్రైనేజీ బ్లాక్ కావడంతో మురుగునీరంతా రోడ్డుపైకి వచ్చింది. స్థానికులు మేయర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన మంగళవారం డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ మల్లికార్జునరెడ్డితో కలిసి డ్రైనేజీ బ్లాక్ అయిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఎక్స్‌కవేటర్ ఏర్పాటు చేయించి కాలువను శుభ్రం చేయించారు.

కలెక్టర్‌ను సత్కరించిన అమరావతి జేఏసీ



కలెక్టర్‌ను సత్కరిస్తున్న ఏపీ అమరావతి జేఏసీ నాయకులు

అనంతపురం టౌన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ వినోద్‌కుమార్‌ను ఏపీ అమరావతి జేఏసీ, రెవెన్యూ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఓటర్ల జాబితా సవరణ, కొత్త ఓటర్ల నమోదులో ఉత్తమ అధికారిగా ఎన్నికల కమిషన్ కలెక్టరుకు రాష్ట్ర స్థాయి అవార్డు ఇచ్చిన విషయం తెలి సిందే. ఈ నేపథ్యంలో మంగళవారం జిల్లాకు చెందిన పలువురు అమరావతి జేఏసీ నాయకులు, రెవెన్యూ అసోసియేషన్ నాయకులు కలెక్టర్‌ను కలిసి సత్కరించి, అభినందనలు తెలిపారు. ఏపీఅమరావతి జేఏసీ జిల్లా చైర్మన్ దివాకరరావు, మహిళా విభాగం చైర్‌పర్సన్ సురేఖారావు, నాయకులు మల్లరాయుడు, పెద్దయ్య, ప్రసాద్, తోట చెన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

పది, ఇంటర్‌లో వందశాతం ఉత్తీర్ణత రావాలి: కలెక్టర్

అనంతపురం టౌన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలల్లో చదుతున్న పదో తరగతి, ఇంటర్ విద్యార్థినులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశించారు. ఆయన మంగ ళవారం కలెక్టరేట్‌లో కేజీబీవీల ప్రిన్సిపాళ్లు, ఎస్ఎస్ఏ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ రెండునెలల పాటు పరీక్షల కోసం ప్రతి ఒక్కరు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఏపీసీ శైలజ,ఏఎంఓ చంద్రశేఖరరెడ్డి, సీఎంఓ గోపాల్, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

ఐఎంఎల్ డిపో ప్రారంభానికి ఏర్పాట్లు చేయండి

అనంతపురం అర్బన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): నగరశివారులోని సోములదొడ్డి వద్ద నూతన ఐఎంఎల్ డిపో ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. స్థానిక సోములదొడ్డి సమీపంలో నిర్మించిన నూతన ఐఎంఎల్ డిపోను మంగళవారం సాయం త్రం పరిశీలించారు. ఐడీ లిక్కర్ నూతన పాలసీలో భాగంగా నగరంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో ఈనెల 31న నిర్వహించే నవోదయం కార్యక్రమాని కి రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర హాజరవుతారని, నూతన ఐఎంఎల్ డిపోను మంత్రి ప్రారంభిస్తారన్నారు. ఎక్సైజ్ డిప్యూటీ కమి షనర్ నాగమద్దయ్య, ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి, సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డి, ఐఎంఎల్ డిపో మేనేజర్ వెంకట నాయుడు, అసిస్టెంట్ మేనేజర్ వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

● సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప

అనంతపురం కల్చరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులో ఫిబ్రవరి 3వ తేదీన నిర్వహించనున్న సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నల్లప్ప పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా కార్యాలయంలో మంగళవారం మహాసభల పోస్టర్లను ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా నల్లప్ప మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా ఉద్యమాల్లో పనిచేసిన 600 మందికి పైగా ప్రతినిధులు మహాసభలకు హాజరవుతారన్నారు. సీపీఎం కొత్త నాయకత్వాన్ని ఎన్నుకుంటారన్నారు. మహాసభలకు సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బృందాకరత్, ఎంఏ బేబి, బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు రమాదేవి హాజరవు తున్నట్లు తెలిపారు. జిల్లా నుంచి వామపక్షవాదులు, ప్రజలు విరివిగా పాలొనాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాగేంద్రకుమార్, రామిరెడ్డి, నాగమణి, రామాంజనేయులు, వెంకటనారాయణ, ముత్తుజా, నగర నాయకులు ప్రకాష్‌రెడ్డి, మసూద్ పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా పాలన: ఎమ్మెల్యే శ్రావణిశ్రీ



ఎ. కొండాపురం గ్రామంలో సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

బుక్కరాయసముద్రం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధే ధ్యేయంగా టీడీపీ కూటమి పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొ న్నారు. ప్రజా పాలన అందిస్తూ చరిత్రలో నిలిచిపోయే విధంగా పలు అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. మండల పరిధిలోని సిద్దరాంపురం పంచాయతీలోని ఎ. కొండాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ఆమె సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజల ఆకాం క్షలకు అనుగుణంగా ఐదేళ్ల తర్వాత సీఎం చంద్రబాబు నాయుడు సారథ్యంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలతో రాష్ట్రం దేశంలోనే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. రానున్న రోజుల్లో రెట్టించిన ఉత్సాహంతో చర్యలు తీసుకుంటామన్నారు. గడిచిన వైసీపీ పాలనలో అవినీతి వల్ల రాష్ట్రం ఆ ర్థికంగా చితికిపోయిందన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ అరుణ కుమార్, జేఈ మద్దిలేటి, ఎంపీడీఓ సాల్మన్‌రాజ్, తహసీల్దార్ పుణ్య వతి, టీడీపీ మండల కన్వీనర్ అశోక్, నాయకులు పసుపుల శ్రీరామ రెడ్డి, హనుమంతరెడ్డి, ఎంపీపీ సునీత, టీడీపీ నేతలు పొడరాళ్ల రవీంద్ర, కేశన్న, లక్ష్మీనారాయణ, జొన్నారామయ్య, ఓబులపతి, పెద్దప్ప, రాము పాల్గొన్నారు.

మా పేరు చెప్పి అవినీతికి పాల్పడితే సహించం : ఎమ్మెల్యే

శింగనమల: తనపేరు, తన కుటుంబ సభ్యుల పేర్లు చెప్పి ఎవరైనా ఇసుక దందాకు, అవినీతికి పాల్పడితే చర్యలు తీవ్రంగానే ఉంటాయని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ హెచ్చరించారు. ఆమె మంగళవారం బుక్కరాయసముద్రం, కొండాపురంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో అధికారులకు ఇప్పటికే ఇసుక దందా విషయంలో సూచనలు ఇచ్చామన్నారు. ఇటీవల కొందరు తనపై, తన కుటుంబ సభ్యులపై సోషల్ మీడియాలో అసత్యప్రచారం చేస్తున్నారన్నారు. ఆ విధం గా ఎవరైనా అవినీతికి, ఇసుకదందాకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. సోషల్ మీడియాలో వచ్చిన ఆడియోలపై విచారణ చేయాలని అధికారులకు సూచించామన్నారు. పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లానన్నారు. ఇటీవల వచ్చిన ఆడియోపై ఇప్పటికే పోలీసులు కేసు నమోదు చేశారని తెలిపారు.

సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలెక్కడ..?

● సచివాలయ సిబ్బందిపై ఎమ్మెల్యే దగ్గుపాటి ఆగ్రహం



సచివాలయ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే

అనంతపురం అర్బన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడు నెలలు కావస్తున్నా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఫొటోలు వార్డు సచివాలయంలో పెట్టకపోవడంపై ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఆదర్శనగర్‌లోని 46వ సచివాలయాన్ని ఎమ్మెల్యే మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలు ఎక్కడా..? అని సిబ్బందిని నిలదీశారు. వెంటనే ఆ ఫొటోలు పెట్టాలని ఆదేశించారు. సచివాలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోకుండా ఇంత నిర్లక్ష్యం వహిస్తారా అంటూ మండిపడ్డారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు గంగారామ్, మాజీ కార్పొరేటర్ సరిపూటి రమణ, నాయకులు పీఎల్ఎన్ మూర్తి, కూచి హరి, రామ్‌ప్రసాద్, సుధాకర్‌యాదవ్, వెంకటేశ్వరరెడ్డి, వన్నూరప్ప, మహబూబ్‌బాషా, నాగభూషణం పాల్గొన్నారు.

నిత్యావసరాలను నిర్ణీత సమయంలో అందించాలి : జేసీ

అనంతపురంటౌన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): చౌక ధరల దుకాణాల ద్వారా నిత్యావసర సరకులను నిర్ణీత సమయంలో రేషన్ కార్డు లబ్ధిదారులకు అందేలా చూడాలని జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ అధికారులను ఆదేశించారు. ఆయన మంగళవారం కలెక్ట రేట్‌లో సివిల్‌సప్లై శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కేటాయించిన సమయంలో ఎండీయూ వాహనాల ద్వారానే సరకుల పంపిణీ చేయాలన్నారు. దీపం-2 పథకం ద్వారా అర్హులందరికీ ఉచితంగా గ్యాస్ సిలిండర్ల పంపిణీ జరగాలన్నారు. కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖాధికారి రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళారుల చేతిలో మోసపోవద్దు : జేడీఏ

గార్లదిన్నె, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కందులు పండించిన రైతులు దళారులకు కాకుండా, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక రైతు సేవాకేంద్రంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కందులకు ప్రభుత్వం క్వింటాకు రూ. 7550 మద్దతు ధర కల్పించిందన్నారు. ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. కందులలో 12 శాతం కంటె తక్కువగా తేమ ఉండాలన్నారు. ప్రైవేట్ వ్యాపారులకు కందులను అమ్మి ఇబ్బం దులు పడవద్దన్నారు. అదేవిధంగా రబీలో సాగుచేసిన పంటలను ఈకేవైసీ తప్పని సరిగా చేయించుకోవాలన్నారు. పంటల సాగులో వ్యవ సాయ అధికారుల సలహాలు పాటించాలన్నారు. ఏడీఏ రవి, ఏఓ సోమశేఖర్, ఏఈఓ స్రవంతి, ఏపీ మార్క్‌ఫెడ్, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



పురవీధుల్లో గంధాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం

ఘనంగా గంధం ఊరేగింపు

శింగనమల, జనవరి 28(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన శింగనమలలో మంగళవారం హజ్రత్ సయ్యద్ సాలార్ మసూద్ గాజీ ఉరుసు సందర్భంగా తెల్లవారుజామున పూల చాందిని, ఫకీర్ల విన్యాసాల నడుమ గంధాన్ని ఊరేగింపుగా దర్గాకు తీసుకెళ్లారు. అనంతపురం, గుంతకల్, తాడిపత్రి, ఉరవకొండ, పెనుకొండ తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు తీసుకున్నారు. సాయంత్రం భక్తులు దర్గాలో చక్కర చదివింపులు చేశారు. దర్గా కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ హాజరై దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాత్రికి ఖవ్వాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దండు శ్రీనివాసులు, బోయ సత్తి, చితంబరి, పసుపుల శ్రీరామిరెడ్డి, జీసీ బాబు, మాసూల చంద్ర, చంద్రాయుడు, అనీల్ తదితరులు పాల్గొన్నారు.



మసూద్ స్వామి దర్గాకు వెళ్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

కూలిపడిన చెట్టు

అనంతపురం సెంట్రల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూలో మంగళవారం చెట్టు కూలి పడిపోయింది. ఎంబీఏ విభాగం భవనం ముందున్న రావిచెట్టు ఉదయం పది గంటల ప్రాంతంలో ఉన్నపలంగా పడిపోయింది. తొమ్మిది గంటలకే తరగతులు ప్రారంభమై విద్యార్థులు, అధ్యాపకులు భవనంలో ఉండటంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. మౌలిక సదుపాయాల పర్యవేక్షక ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన సిబ్బంది అందుబాటులో లేకపోడంతో కూలిపడిన చెట్టును బుధవారం తొలగిస్తామని అధికారులు తెలిపారు.

అదనపు జలాలను కుడికాలువకు ఇవ్వాలి

● ఎస్‌ఈకి పండ్లతోటల రైతుల సంఘం నాయకుల వినతి



హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): టీబీ డ్యాం నుంచి హెచ్చెల్సీకి అదనంగా కేటాయించిన జలాలను పీఏబీఆర్ కుడి కాలువకు ఇవ్వాలని జిల్లా పండ్ల తోటల రైతు సంఘం నాయకులు కోరారు. వారు మంగళవారం హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు అనంతరాముడు మాట్లాడుతూ పీఏబీఆర్ కుడి కాలువ కింద తుంగభద్ర జలాలను నమ్ముకుని వేలాది ఎకరాల ఆయకట్టులో రైతులు పంటలు సాగుచేశారన్నారు. టీబీ డ్యాం నుంచి హెచ్చెల్సీకి అదనపు జలాలు కేటాయించిన నేపథ్యంలో వాటిని పీఏబీఆర్ కుడికాలువకు ఇవ్వాలన్నారు. పీఏబీఆర్ కుడికాలువ పరిధిలోని చెరువులు, కుంటలను నిపండంతో పాటు, బత్తలపల్లి మండలంలోని అన్ని గ్రామాలకు నీటి సౌకర్యం కల్పించాలన్నారు. ఫిబ్రవరి ఆఖరు వరకు నీరిచ్చి, పంటలను కాపాడాలని కోరారు. టీబీ డ్యాం నుంచి కష్టకాలంలో అదనపు జలాలు సాధించిన ఎస్ఈకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నారపరెడ్డి, మురళీమోహన్ చౌదరి, రామాంజనేయులు, రంగాచారి, పెద్దిరెడ్డి, వెంకటేష్‌చౌదరి, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఉచిత న్యాయ సేవలను వినియోగించుకోండి


మాట్లాడుతున్న న్యాయాధికారి శివప్రసాద్ యాదవ్

కూడేరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి) : వికలాంగులు, మహిళలు ఉచిత న్యాయ సేవలను వినియోగించుకోవాలని డీఎల్ఎస్ఏ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం కూడేరు ఐకేపీ కార్యాలయంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ లీగల్ సర్వీసెస్ అథారిటీస్ కోర్టుకు ఉన్న అధికారుల గూర్చి వివరించారు. వికలాంగులు, మహిళలు, బాలికలు ఆదాయంతో సంబంధం లేకుండా ఉచితంగా న్యాయ సేవలను పొందవచ్చన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు హరికృష్ణ, పద్మజ, ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, ఏపీఎం దేవానంద ఫిలిప్స్, ఏపీఓ తులసీప్రసాద్, సీడీపీఓ శ్రీదేవి, ఈఓఆర్డీ రాధాకృష్ణ పాల్గొన్నారు.

దొంగలను పట్టుకున్న గ్రామస్థులు


గ్రామస్థుల అదుపులో దొంగలు

ఉరవకొండ,జనవరి28(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలంలోని పొట్టిపాడులో దొంగలు పట్టపగలే హల్‌చల్ చేశారు. వ్యవసాయ పరికారాలు చోరి చేసే దొంగలను గ్రామస్థులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. గ్రామ సమీపంలో హం ద్రీనీవా కాలువపై మంగళవారం వ్యవసాయమోటార్లు, పరికరాలను దొంగలు చోరీకి పాల్పడుతుండగా రైతులు, గ్రామస్థు లు గుర్తించారు. వారిని పట్టుకునేందుకు రైతు ప్రయత్నించ గా బైక్‌తో ఢీకొని పరారవుతుండగా పట్టుకున్నారు. గ్రామం లో స్తంభానికి కట్టేసి దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. ఉరవకొండకు చెందిన రాజు, హుస్సేన్‌బాషాలుగా గుర్తించారు. ఎస్ఐ నాగస్వామి మాట్లాడుతూ కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నామన్నారు.

ఆటపాటలతో చదువు చెప్పాలి

కూడేరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న చిన్నారులకు ఆటల పాటలతో చదువులు చెప్పాలని సీడీపీఓ శ్రీదేవి పేర్కొన్నారు. మంగళవారం కూడేరులో అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ యల్లమ్మ, సూపర్‌వైజర్లు రాజేశ్వరీ, అరుణ పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరానికి అనూహ్య స్పందన

గుంతకల్లు టౌన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక పాత గుంతకల్లులోని విద్యారణ్య పాఠశాలలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆ పాఠశాల కరస్పాండెంట్ మంజుల వెంకటేష్ మాట్లాడుతూ వచ్చే నెల 4,5,6వ తేదీలలో ఉచితంగా ఆపరేషన్ చేయించి కంటి అద్దాలు అందజేస్తామన్నారు. బళ్లారిలోని ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ సిబ్బంది 262 మందికి పరీక్షలు నిర్వహించారు. 82 మందికి ఆపరేషన్లు చేయనున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగేశ్వరి, బీ జేపీ నాయకులు కృష్ణమూర్తి, శేఖన్న, కోఆర్డినేటర్ రఫీ పాల్గొన్నారు.

మెరుగైన వైద్యమే సీహెచ్‌సీ ధ్యేయం

పామిడి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): నిరుపేద రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ) ధ్యేయమని సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివకార్తీకేయరెడ్డి పేర్కొన్నారు. సీహెచ్‌సీ మీటింగ్ హాలులో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు చిలకల రాజగోపాల్ మాట్లాడారు. ఆసుపత్రిలో రోగులకు అన్ని వేళలా వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు. అన్ని సౌకర్యాలు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

గుత్తి ఆర్‌ఎస్‌లో చోరీ

గుత్తి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): గుత్తిఆర్‌ఎస్‌లోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల సమీపంలో నివాసముంటున్న గోపి ఇంట్లో సోమవారం రాత్రి దుండుగుల చోరీకి పాల్పడి వెండి, బంగారు ఆభరణాలు అపహరించినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గోపి బేల్దారి వృత్తితో జీవనం సాగిస్తున్నాడు. అతడి భార్య ఇంటికి తాళం వేసి పుట్టింటికి వెళ్లింది. దుండగులు ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న 30 తులాల వెండి, ఒక తులం బంగారం ఆభరణాలు ఎత్తుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

బీసీ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజశేఖర్


నియామక పత్రం అందుకుంటున్న రాజశేఖర్

పామిడి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పామి డికి చెందిన రాజశేఖర్‌ను నియమిస్తూ జాతీయ అధ్యక్షు డు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. విజయవాడలో జరిగిన సమావేశంలో ఈ మేరకు నియామక పత్రం అందజేశారు. బీసీలు, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన తెలిపారు.

ప్రతి రైతుకు రూ.20వేలు చెల్లించాలి

పుట్లూరు, జనవరి28(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామిల్లో భాగంగా ప్రతి రైతుకు రూ.20వేలు చెల్లించాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున డిమాండ్‌చేశారు. మండలకేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రైతాంగ సమస్యలపై దృష్టి పెట్టలేదన్నారు. సమావేశంలో నాయకులు రామాంజనేయులు, గోపాలకృష్ణ, సత్తార్‌గోపాల్, బాలగురయ్య పాల్గొన్నారు.

పింఛన్ల పరిశీలన

యాడికి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలో మంచానికే పరిమితమై రూ.15వేల పింఛన్ పొందుతున్న లబ్ధిదారులను మంగళవారం పరిశీలించారు. కర్నూలు నుంచి వచ్చిన ప్రత్యేక వైద్య బృందం పింఛన్ లబ్ధిదారుల ఇళ్లవద్దకు వెళ్లి పరిశీలించారు. మండలవ్యాప్తంగా మంచానికే పరిమితమై రూ.15వేలు పింఛన్ పొందుతున్న వారు 58మంది ఉన్నారు. వైద్యబృందం వెంట ఎంపీడీఓ వీరరాజు, యాడికి ప్రభుత్వ డాక్టర్ పరమేశ్వర్, డాక్టర్ దేవరాజన్ ఉన్నారు.

● పెద్దపప్పూరు: నకిలీ ధ్రువపత్రాలతో దివ్యాంగుల కోటా కింద పింఛన్లు పొందుతున్న వారిని గుర్తించేందుకు రీ వెరిఫికేషన్ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శకుంతల తెలిపారు. మంచానికే పరిమితమైన దివ్యాంగులు అనారోగ్యంతో బాధపడుతున్న వారు 78మంది ప్రతినెలా రూ.15వేలు పింఛన్ తీసుకుంటున్నారని ఎంపీడీఓ తెలిపారు.

ఆర్టీసీ బస్టాండుకు పూర్వవైభవం వచ్చేనా..?

● విలువైన స్థలం ఆక్రమణ..? ● పామిడిలో బస్ షెల్టర్ కరువు ● ఇబ్బందుల్లో ప్రయాణికులు



పామిడి ఆర్టీసీ బస్టాండ్, శిథిలావస్థలో మరుగుదొడ్లు

పామిడి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిర్మించిన ఆర్టీసీ బస్టాండుకు పూర్వవైభవం వచ్చేనా అన్న సందేహాలు తలెత్తుతున్నాయి. తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు పామిడికి వచ్చిన సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్ నిర్మించాలని అప్పటి ఎంపీపీ అంజనేయులు గౌడ్ ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో 1989 సంవత్సరంలో ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణానికి మేజర్ పంచాయతీ సర్వేనంబర్ 427లో రెండు ఎకరాలను కేటాయించింది. ఆ స్థలంలోని కొంత భాగంలో ఆర్టీసీ బస్టాండ్‌ను నిర్మించారు. ఈ బస్టాండ్‌ను 1991 ఆగస్టు 20న అప్పటి రోడ్లు, భవనాలశాఖ మంత్రి జేసీ దివాకర్‌రెడ్డి, నాటి ఎంపీపీ అంజనేయులుగౌడ్ ప్రారంభించారు. ఈ బస్టాండ్ కాలక్రమేణా నిరుపయోగమైంది. బస్సులు బస్టాండులోకి రాకపోవడం, మరికొన్ని జాతీయ రహదారిపైనే వెళ్తుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆర్టీసీ బస్టాండ్‌కు కేటాయించిన స్థలం ప్రస్తుతం రూ.కోట్లలో విలువ చేయడంతో ఆక్రమణకు గురవుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాల చుట్టూ ఇళ్లు, వ్యాపార సముదాయాలు వెలిశాయి. దీంతో ఆ స్థలంపై పలువురు కన్నేశారు. ఎంతో విలువైన స్థలాన్ని పరిరక్షించేందుకు అధికారులు మాత్రం నామమాత్రపు చర్యలు తీసుకుంటూ చేతులు దులుపుకుంటున్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు స్థలాన్ని కొలతలు వేసి ప్రహరీ నిర్మిస్తేగాని దురాక్రమణలను అరికట్టడం సాధ్యం కాదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. బస్టాండ్ శిథిలావస్థకు చేరుకుంది. ఇప్పటికే మరుగుదొడ్లు పూర్తిగా శిథిలమయ్యాయి. బస్టాండ్ ప్రాంగణం అపరిశుభ్రతకు నిలయమైంది. ప్లాట్ ఫాంలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వ్యాపారాల కోసం ఇతర ప్రాంతాల నుంచి ఎంతో మంది పామిడికి వస్తుంటారు. పట్టణంలో ఒక్క బస్‌షెల్టర్ కూడా లేదు. దీంతో ప్రయాణికులు దుకాణాల వద్ద బస్సుల కోసం వేచిచూడాల్సిన దుస్థితి దాపురించింది.

పల్లె బస్సులు మాత్రమే వస్తున్నాయి



ఆర్టీసీ బస్టాండ్‌కు పల్లె వెలుగు, పార్శిల్ బస్సులు మాత్రమే వస్తున్నాయి. దీంతో ప్రయాణికులు బస్టాండ్‌కు వెళ్లడం లేదు. గుత్తి, గుంతకల్లు డిపోలకు చెందిన బస్సులు మాత్రమే బస్టాండ్ మీదుగా వెళ్తున్నాయి. ఇతర బస్సులు జాతీయ రహదారి మీదుగానే వెళ్తున్నాయి.

- అప్పన్నగారి కుమార్, పామిడి

ప్రతి బస్సు బస్టాండుకు రావాలి



పామిడిలోకి వచ్చే ప్రతి బస్సు ఆర్టీసీ బస్టాండుకు రావాలి. అప్పుడే బస్టాండ్ పూర్తిస్థాయిలో వినియోగానికి నోచుకుంటుంది. ఆర్టీసీ ఉన్నతాధికారులు జాతీయ రహదారిపై వెళ్లకుండా ప్రతి ఆర్టీసీ బస్సు పామిడిలోకి వచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలి. బస్సు ఎక్కేటప్పుడు పామిడి స్టాపింగ్ ఉందా..? అని అడిగి ఎక్కే పరిస్థితి నెలకొనడం బాధాకరం.

- బొమ్మా మోహన్‌కృష్ణ, పామిడి

వినియోగంలోకి తీసుకువస్తాం



పామిడిలోని ఆర్టీసీ బస్టాండును పూర్తిస్థాయిలో వినియోగానికి తీసుకువస్తాం. ఇటీవలే బస్టాండును సందర్శించాను. అందుకు అవసరమైన నివేదికలను తయారు చేయాలని ఆర్టీసీ ఆర్‌ఎంకు సూచించాం. ప్రహరీ నిర్మాణం , శిథిలావస్థకు చేరుకున్న భవనాల మరమ్మతులు, బస్టాండ్ ప్లాట్ ఫాంలను పునరుద్ధరిస్తాం. బస్టాండ్ అభివృద్ధి కోసం వీలైతే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి నిధులు సమకూరుస్తాం.

- గుమ్మనూరు జయరాం, ఎమ్మెల్యే, గుంతకల్లు

మున్సిపల్ చైర్‌పర్సన్‌పై సొంత పార్టీ కౌన్సిలర్ల తిరుగుబాటు


మున్సిపల్ సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

రాయదుర్గంటౌన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ చైర్‌పర్సన్‌పై ఆ పార్టీకి చెందిన కౌన్సిలర్లే తిరుగుబాటు చేశారు. మున్సిపల్ సాధారణ సమావేశం మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమైంది. చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. 32 మంది కౌన్సిలర్లు ఉండగా ఇద్దరు వైస్‌చైర్మన్లతో పాటు 16 మంది కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. వారి మధ్యలో ఉన్న అసమ్మతి రచ్చకెక్కింది. ఉద్దేశ్యపూర్వకంగా ఓ వర్గానికి చెందిన కౌన్సిలర్లు మున్సిపల్ సాధారణ సమావేశానికి హాజరు కాలేదు. మెజార్టీ కౌన్సిలర్లకు మున్సిపల్ చైర్‌పర్సన్‌పై ఉన్న అసంతృప్తి బహిర్గతమైంది. చైర్‌పర్సన్‌కు కౌన్సిలర్ల మధ్య ఆది నుంచి కోల్డ్ వార్ కొనసాగుతోంది. చైర్‌పర్సన్ పద్ధతి మార్చుకోకపోతే అవిశ్వాస తీర్మానానికి సిద్ధమంటూ వైస్‌చైర్మన్లు వలిబాష, శ్రీనివాసయాదవ్ హెచ్చరించారు. కోరం లేకపోయినా సాధారణ సమావేశాన్ని నిర్వహించడంపై మీడియా సమావేశాన్ని నిర్వహించి తప్పుపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్లు శ్రీనివాస్‌యాదవ్, వలిబాష, కౌన్సిలర్లు అజయ్, శ్రీనివాసరెడ్డి, ఫకృద్దీన్ మాట్లాడుతూ.. చైర్‌పర్సన్ మెజార్టీ కౌన్సిలర్ల పట్ల పక్షపాత ధోరణి అవలంభిస్తుండడంతో సాధారణ సమావేశానికి హాజరు కాలేదని తెలిపారు. మున్సిపల్ సాధారణ సమావేశానికి అవసరమైన కోరం పూర్తిస్థాయిలో ఉండడంతోనే నిర్వహించినట్లు కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు.

దక్షిణభారత సైన్స్‌ఫెయిర్‌లో విద్యార్థుల ప్రతిభ


అవార్డు అందుకుంటున్న విద్యార్థినులు

కణేకల్లు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని హనకనహాళ్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న గీతారెడ్డి, మహాలక్ష్మి అనే విద్యార్థినులు దక్షిణ భారత సైన్స్‌ఫేర్‌లో తమ ప్రతిభను చూపారు. పుదుచ్చేరిలో ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు దక్షిణభారతస్థాయి సైన్స్‌ఫెయిర్ నిర్వహించగా ఇందు లో పాల్గొన్న విద్యార్థులకు వృద్ధులకు అన్ని రకాలుగా ఉపయోగపడే ఊతకర్ర ప్రాజెక్టుకు సంబంధించి బహుమతి లభించింది. ఈ ప్రాజెక్టుకు ప్రత్యేక కేటగిరి బహుమతి లభించినట్లు సైన్స్ ఉపాధ్యాయుడు మేడా ప్రసాద్ తెలిపారు.

రీ సర్వేను పకడ్బందీగా చేపట్టాలి : ఆర్డీఓ

కంబదూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రీ సర్వేను ఎలాంటి లోటుపాట్లు లేకుండా రైతుల సమక్షంలోనే పకడ్బందీగా చేయాలని ఆర్డీవో వసంతబాబు తెలిపారు. మండల పరిధిలోని కర్తనపర్తిలో నిర్వహిస్తున్న రీ సర్వేను ఆయన మంగళవారం పరిశీలించారు. ఎక్కడెక్కడ రీ సర్వేను చేపడుతున్నారో ముందుగా ఆయా రైతులకు సమాచారం ఇవ్వాలన్నారు. కళ్యాణదుర్గం డివిజన్ సర్వేయర్ సూర్యనారాయణరెడ్డి, మండల సర్వేయర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు గృహాలు నిర్మించి ఇవ్వాలి: సీపీఐ


మాట్లాడుతున్న జాఫర్

పెద్దవడుగూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): పేదలకు ప్రభుత్వమే గృహాలు నిర్మించి ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు గ్రామాల్లో 3సెంట్లు, పట్టణాల్లో 2సెంట్ల చొప్పున ఇళ్లస్థలాలు ఇవ్వాలని రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్ణయించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఇంటినిర్మాణానికి కూడా రూ.5లక్షలకు పెంచాలన్నారు. పెంచిన విద్యుత్ సర్దుబాటు చార్జీల భారాలను ప్రభుత్వమే భరించాలని డిమాండ్‌చేశారు. సమావేశంలో నాయకులు కేశవరెడ్డి, వెంకటరాముడు, నారాయణ, హుస్సేన్‌పీరా, రంగస్వామి, రంగనాయకులు పాల్గొన్నారు.

నెట్టికంటి సన్నిధిలో గుంటూరు డీఆర్‌ఎం


పూజలు చేస్తున్న డీఆర్‌ఎం

గుంతకల్లు, జనవరి28(ఆంధ్రజ్యోతి): కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలో గుంటూరు డీఆర్‌ఎం ఎం రామకృష్ణ కుటుంబ సమేతంగా పూజలు చేశారు. మంగళవారం ఉదయం దేవస్థానానికి వచ్చిన ఆయనకు ఆలయ అర్చకులు సాదరంగా ఆహ్వానించి స్వామివారి సన్నిధిలో పూజలు చేయించారు. అనంతరం స్వామివారి శాలువ, ప్రసాదాలను అందజేసి ఆశీర్వచనం పలికారు.

కసాపురం ఆలయంలో మన్యుసూక్త హోమం

నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం ఉదయం మన్యుసూక్త హోమాన్ని నిర్వహించారు. ఆలయ యాగశాలలో ఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహానికి, సీతారామ లక్ష్మణ స్వామివార్ల చిత్రపటాలకు పూలమాలలు, తులసీ మాలలలో అలంకరించి మన్యుసూక్త హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

తిరుణాల ఏర్పాట్లను పరిశీలించిన ఏఎస్పీ

పెద్దపప్పూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): అశ్వర్థనారాయణస్వామి తిరుణాల ఏర్పాటు పనులను మంగళవారం తాడిపత్రి ఏఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి, సీఐ వెంకటసుబ్బయ్య పరిశీలించారు. ఆలయ అధికారులతో మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగు ఏర్పాట్లను చేయాలని ఈఓ సుబ్రహ్మణ్యంకు సూచించారు. పార్కింగ్ దూరంగా ఏర్పాటు చేయాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఎస్ఐ నాగేంద్రప్రసాద్ సిబ్బంది ఉన్నారు.

వన్యమృగాల సమాచారమివ్వండి

యాడికి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): వన్యమృగాల సంచారం కనిపిస్తే వెంటనే అటవీశాఖ లేదా పోలీసు అధికారులకు సమాచారం అందించాలని అటవీశాఖ గుత్తి సెక్షన్ ఆఫీసర్ నారపరెడ్డి, యాడికి సీఐ ఈరన్న తెలిపారు. మండలంలోని గుడిపాడు గ్రామం సాగర్ సిమెంట్స్ అటవీప్రాంతంలో పులి సంచారం జరిగిందనే సమాచారంతో మంగళవారం అటవీశాఖ అధికారులు, పోలీసు సిబ్బంది అక్కడకు వెళ్లి పరిశీలించారు. పులి సంచారాన్ని పరిశీలించానని తెలిపిన వృద్ధుడితో వివరాలు ఆరాతీశారు. సమీప ప్రాంతంలో గాలించారు. అనంతరం గుడిపాడు గ్రామస్తులకు వన్య మృగాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫారెస్ట్‌బీట్ ఆఫీసర్ మాధవి, ఏబీఓలు చంద్రశేఖర్, తిమ్మప్ప పాల్గొన్నారు.

ఘనంగా గ్రామ మహోత్సవం

రాయదుర్గంరూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేపరాల గ్రామంలో మంగళవారం కొల్లాపురమ్మ, మారెమ్మ దేవతల గ్రామ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి తెల్లవారుజామున బలిదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తొమ్మిదేళ్లకోసారి గ్రామమహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కుమారుడు కాలవ భరత్ అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలని నిరసన

రాయదుర్గం రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంసీఏ లేఅవుట్‌లో తీవ్ర తాగునీటి సమస్య ఎదుర్కొంటున్నట్లు మహిళలు వాపోయారు. మంగళవారం రాయదుర్గం నుంచి కణేకల్లుకు వెళ్లే ప్రధాన రహదారిపై ఖాళీ బిందెలతో బైఠాయించి నిరసన తెలిపారు. తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ఎవరూ పట్టించుకునే నాథుడే లేరని వారు వాపోయారు.

కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం

కూడేరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పి. నారాయణపురం గ్రామంలోని సచివాలయం వద్ద కందుల కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఓ విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. కందులు పండించిన రైతుల పేర్లు రిజిష్టర్ చేసుకున్న తర్వాత కొనుగోలు చేస్తామన్నారు.

● బెళుగుప్ప: మండల కేంద్రంలో మంగళవారం కంది కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ పెద్దన్న ప్రారంభించారు. రైతులను ఆదుకోవడానికే ప్రభుత్వం కంది పంటకు గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేస్తుందని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి పృథ్వీసాగర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనర్హుల ఆధీనంలో ఉన్న పట్టాలను రద్దుచేయండి : ఎమ్మెల్యే


జగనన్న లేఅవుట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జయరాం, అధికారులు

గుంతకల్లు, జనవరి28(ఆంధ్రజ్యోతి): జగనన్న లేఅవుట్‌లో అనర్హుల ఆధీనంలో ఉన్న ఖాళీ స్థలాలను, బేస్‌మెంట్లను స్వాధీనం చేసుకుని అర్హులకు పంపిణీ చేయాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఆర్డీవో, తహసీల్దారుకు సూచించారు. మంగళవారం సాయంత్రం స్థానిక దోనిముక్కల రోడ్డులోని 1వ జగనన్న లేఅవుట్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమయం ఇచ్చినా నిర్మించుకోలేదని, దీన్నిబట్టి స్థలాలు అనర్హుల ఆధీనంలో ఉన్నట్టు స్పష్టమౌతోందన్నారు. ఖాళీ ప్లాట్లను, నిర్మించి వదిలేసిన బేస్‌మెంట్లపై సమగ్ర విచారణ చేయాలని ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దారు రమాదేవికి సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నారాయణస్వామి, బండారు ఆనంద్, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, పత్తి హిమబిందు, మహమ్మద్ ఖాజా, హేమాద్రి, శ్రీరాములు, పాల్గొన్నారు.

బీసీ బాలికల హాస్టల్ ప్రారంభం

మరమ్మతులు చేసిన బీసీ బాలికల హాస్టల్‌ను ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. హనుమేశ్ నగర్‌లోని బీసీ బాలికల హాస్టలు శిథిలావస్థకు చేరగా పీఎంకేకేకేవైపై నిధులు రూ.8.36 లక్షలను వెచ్చించి మరమ్మతులు చేశారు.

కందుల కొనుగోలుకు నిబంధనలు సడలించాలి : సీపీఎం


కందులను పరిశీలిస్తున్న నాయకులు

ఉరవకొండ, జనవరి28(ఆంధ్రజ్యోతి): కందుల కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వం విధించిన నిబంధనలు సడలించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ డిమాండ్ చేశారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో కందుల కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డులో కందులు ఆరబోసిన రైతులతో మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మద్దతు ధర రూ.7,550లతో పాటు, బోనస్ రూ.500తో కందుల కొనుగోలు చేయాలన్నారు. ప్రభుత్వం విధించిన నిబంధనల వల్ల రైతులు పంటను అమ్ముకోవడానికి అడ్డంకుగా ఉన్నాయన్నారు. జిల్లాలో ఎక్కువ మంది కౌలు రైతులు ఉన్నారని, వారి వద్ద నుంచి కందుల కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బాలరంగయ్య, రంగారెడ్డి, మధుసూధన్‌నాయుడు, శీనప్ప పాల్గొన్నారు.

వెలుగు కార్యాలయం వద్ద మహిళల ధర్నా


ఏపీఎంతో వాగ్వాదం చేస్తున్న మహిళలు

విడపనకల్లు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సాయిబాబా సంఘం మహిళా సభ్యులకు లేని రుణాలు చూపించి మోసం చేశారని మంగళవారం వెలుగు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి బాబా మహిళా సంఘం సభ్యులు మాట్లాడుతూ.. గతంలో తాము తీసుకున్న రుణాన్ని మొత్తం చెల్లించామన్నారు. యానిమేటర్ మమత మోసం చేసి తమపై రూ. 6.5 లక్షలు రుణం ఉన్నట్లు చూపించారన్నారు. ఈ విషయమై ఏపీఎం కాలా నాయక్ మాట్లాడుతూ అప్పులన్ని మీ సంఘం సభ్యులు తీసుకున్నట్లు రికార్డుల్లో ఉందన్నారు. మమతకు ఎటువంటి సంబంధం లేదని తెలిపారు. మహిళలు ధర్నా చేయటానికి వెలుగు కార్యాలయానికి రావటంతో ఏపీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందుగా మీపైనే కేసు పెడితే అన్ని తెలుస్తాయన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి : ఆర్డీఓ


బుద్ధ విగ్రహం వద్ద ఆర్డీఓ, చైర్మన్

గుంతకల్లుటౌన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని ఆర్డీఓ ఏబీవీఎస్‌బీ శ్రీనివాస్ పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీ శంకరా నందగిరిస్వామి డిగ్రీ కళాశాలలో మంగళవారం కళాశాల 41వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ కష్టపడి ఏకాగ్రతతో చదివితేనే మంచి ఫలితాలు వస్తాయన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, కళాశాల చైర్మన్ డీఏ మురళీకృష్ణ, కరస్పాండెంట్ కేసీ హరికుమార్, డైరెక్టర్ గోపాల్, వైస్‌చైర్మన్ రంగయ్య, కోశాధికారి అశ్వర్థమ్మ, ఈసీ సభ్యులు బాలయ్య, మధుమోహన్ పాల్గొన్నారు.

ఐదు టన్నులు లాగిన ఎద్దు


బస్తాలను లాగిన ఎద్దు

బొమ్మనహాళ్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్గాహోన్నూరు గ్రామంలో మంగళవారం ఐదు బండ్లలో 50 కిలోలు ఉండే 105 జొన్న బస్తాలను ఒకే ఎద్దుతో సుమారు రెండు కిలో మీటర్లు లాగించారు. మూగజీవాలు కదా అదిలిస్తే పోతాయని అనుకుంటున్నారో ఏమో ఎంతంటే అంత బరువు వాటిపై వేసి లాగిస్తున్నారు. అనంతరం గ్రామంలో ఎద్దును ఊరేగించారు.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

గుంతకల్లు టౌన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): గుట్టను చదును చేసి మట్టిని తరలిస్తున్న రైల్వే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ శ్రీనివాస్‌కు మంగళవారం సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి బి. సురేష్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కసాపురం గ్రామం చెన్నప్ప కొట్టాల రోడ్ క్రాస్ వద్ద సర్వేనెంబర్424 ప్రభుత్వ గుట్ట ఉందన్నారు. ఆ గుట్టను తవ్వి ఎర్రమట్టిని తిమ్మనచెర్ల రైల్వే స్టేషన్ వద్ద లూప్‌లైన్ రైల్వే ట్రాక్ నిర్మాణం కోసం ఉపయోగిస్తున్నారని తెలిపారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో నాయకులు జిలాన్, నారాయణ, విశ్వనాథ్, సద్దాం, భాషా, శ్రీనివాసులు ఉన్నారు.

మహా ప్రదర్శనను జయప్రదం చేయండి

యాడికి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7న నిర్వహించే వేల గొంతుకలు- లక్షల డప్పులుమహా ప్రదర్శనను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పుల్లయ్య తెలిపారు. మంగళవారం మండలంలోని చింతలాయపల్లి, కమలపాడు గ్రామాల్లో మాదిగలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు నరసింహులు, సూర్యుడు, కుళ్లాయప్ప, కంబగిరిస్వామి, వెంకటరమణయ్య పాల్గొన్నారు.

12న లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం

రాయదుర్గంరూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లాపురం గ్రామ సమీపంలో వెలసిన విప్రమలై శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఫిబ్రవరి 12న బ్రహ్మరథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఆలయకమిటీ గౌరవ అధ్యక్షుడు రామ్మూర్తిస్వామీజీ పేర్కొన్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారికి కృపకు పాత్రులు కావాలని కోరారు.

నాగేశ్వరరెడ్డిని అభినందించిన ఎమ్మెల్సీ


నాగేశ్వరరెడ్డిని అభినందిస్తున్న ఎమ్మెల్సీ

ఉరవకొండ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): పద్మ విభూషణ్ అవార్డుకు ఎంపికైన ప్రముఖ వైద్యులు దువ్వూరి నాగేశ్వరరెడ్డిని ఎమ్మెల్సీ శివరామిరెడ్డి కలిశారు. హైదరాబాదులోని ఏఐజీ ఆసుపత్రిలో మంగళవారం ఆయనను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపా రు. వైద్యరంగంలో నాగేశ్వరరెడ్డి చేసిన సేవలను, పరిశోధనలు గుర్తించి పద్మవిభూషణ్ రావడం సంతోషకరమని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

గుత్తి రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని రజాపురం గ్రామ శివారులోని 67వ జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలయ్యాయి. యాడికికి చెందిన సందీప్ కుమార్ అనే యువకుడు బైక్‌పై గుంతకల్లుకు వెళ్లి తిరిగి వస్తుండగా రజాపురం గ్రామశివారులోకి రాగానే బైక్ అదుపు తప్పి బోల్తా పడడంతో గాయాలయ్యాయి.

మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

బెళుగుప్ప, జనవరి 28(ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగం కల్పించిన మహిళా చట్టాలపై అవగాహన పెంచుకుని సద్వినియోగం చేసుకున్నప్పుడే ప్రయోజనం పొందవచ్చునని న్యాయవాది పార్థసారథి పేర్కొన్నారు. స్థానిక రవితేజ మండల సమాఖ్య కార్యాలయంలో మంగళవారం మహిళా చట్టాలు, న్యాయ సలహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.

పెళ్లి వేడుకల్లో ఘర్షణ.. ఇద్దరికి గాయాలు

గుత్తి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని చెట్నేపల్లిలో తిరుగు పెళ్లి వేడుకల్లో చిన్నపాటి విషయమై జరిగిన ఘర్షణలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మంగళవారం చెట్నేపల్లిలో జరిగిన తిరుగు పెళ్లిలో తాంబూలం విషయంలో గొడవ ఘర్షణకు దారితీసింది. మాబు,ఆసీఫ్, ఫరీదాపై మహ్మద్ రసూల్, రెహనా, జరీనా, మహబుబ్ బాష దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో మాబు, ఆసీఫ్ తీవ్రంగా గాయపడగా స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు కేసు నమోదు చేసుకున్నారు.